


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 344 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | మంగళవారం 22 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-



## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా..?

- ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం
- బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ
- అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల .....

మిగతా 2వ పేజీ లో..

## 30 రోజుల్లో వరంగల్ ఆసుపత్రి నిర్మాణం పూర్తి కావాలి

- సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్

- గ్రీన్ ఛానల్‌లో నిధులు ఇస్తున్నా పనుల్లో జాప్యంపై అధికారులపై ముఖ్యమంత్రి అసహనం.
- వచ్చే 30 రోజుల పాటు 24 గంటలూ పనులు కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు.
- కలెక్టర్ల ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ వేసి రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని సూచన.
- సనత్‌నగర్ టిమ్స్ తరహాలోనే వరంగల్ ఆసుపత్రిలోనూ త్వరలోనే ఓపీ సేవలు ప్రారంభం.



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి గ్రీన్ ఛానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ పనుల్లో జాప్యం జరగడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడిన ఆయన, వచ్చే 30 రోజుల పాటు రోజుకు 24 గంటలూ నిరంతరాయంగా పనులు కొనసాగించాలని ఆదేశించారు. పనుల ప్రగతికి నిర్దిష్ట షెడ్యూల్..

మిగతా 2 వ పేజీ లో..

## ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత.. పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ.. బారికేడ్లు తొలగింపు!

- గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలతో ట్యాంక్‌బండ్‌పై హైటెన్షన్
- నిరసనకు దిగిన భాగ్యనగర్ ఉత్సవ సమితి, పోలీసుల మధ్య తోపులాట
- హైకోర్టు ఆదేశాల మేరకే ఆంక్షలని అధికారుల స్పష్టీకరణ
- సంప్రదాయాన్ని వీడేది లేదని, ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనం చేస్తామని పట్టు

2



## తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్న మాజీ మావోయిస్టులు

- లంకా పాపిరెడ్డి, అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్ నేతృత్వంలో పార్టీ
- పార్టీ నిర్మాణంలో దేవ్‌జీ, సంగ్రామ్ ల భాగస్వామ్యం లేనట్టు సమాచారం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న పార్టీ

2



## సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

- పోటీ పరీక్షల సిలబస్‌పై వస్తున్న వదంతలకు టీజీపీఎస్సీ తెర
- ప్రస్తుతానికి ఎలాంటి సిలబస్ కమిటీని ఏర్పాటు చేయలేదని వెల్లడి
- పెద్ద మార్పులు ఉంటే ఏడాది ముందుగానే సమాచారం ఇస్తామని హామీ
- చిన్నపాటి మార్పులను నోటిఫికేషన్‌లోనే తెలియజేస్తామని ప్రకటన

2

## బేగంపేటలో భారీ చోరీ.. 81 తులాల బంగారం, నగదు అపహరణ



**81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు అపహరణ**

**ఇంట్లో పనిచేసే సిబ్బందిపైనే అనుమానం**

**ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు**

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్ బేగంపేట ఉమానగర్‌లో భారీ చోరీ జరిగింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన శ్రీనాథ్ నాయుడు ఇంట్లో అల్మారాలో దాచిన 81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు మాయమయ్యాయి. నగలు, నగదు కనిపించకపోవడం ఆలస్యం గా గుర్తించిన బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో పనిచేసే సిబ్బంది వివరాలను పోలీసులకు అందజేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చోరీకి పాల్పడింది వారేనా లేక ఇతరుల ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

## దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

- ఎపార్టీ ఫిరాయింపుల కేసులో దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు
- హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం
- దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు

2





## 30 రోజుల్లో వరంగల్ ఆసుపత్రి
# నిర్మాణం పూర్తి కావాలి
- సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్

**మొదటిపేజీ తరువాయి..** రూపొందించి, ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని, కలెక్టర్లు రోజువారీగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల సమన్వయం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. సనత్‌నగర్ టిమ్స్ తరహాలోనే వరంగల్ ఆసుపత్రిలోనూ వెంటనే ఓపీ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, ఆసుపత్రి నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని ఆదేశించారు. అలాగే సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, వైద్య ఆరోగ్య, రోడ్లు భవనాలు, పురపాలక శాఖల ఉన్నతాధికారులు, వరంగల్ మరియు హనుమకొండ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## రైతులకు నీళ్లివ్వమంటే
# అరెస్టులా..?

**మొదటిపేజీ తరువాయి..** చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని..ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం (సెప్టెంబర్ 23) విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరపు న్యాయవాదులు సుప్రీం కోర్టులో వాదనలు వినిపించనున్నారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కన పెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హౌస్ అరెస్ట్




**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ప్రాజెక్టు ముట్టడి పిలుపు జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు భారీ ఎత్తున రంగంలోకి దిగి ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని వనపర్తిలోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకుని గృహనిర్బంధం చేశారు. ముట్టడి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఇంటెలిజెన్స్ బలగాలను మోహరించి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల దిగ్బంధంతో జూరాల ఆనకట్ట పరిసరాలు, క్షేత్రస్థాయి ప్రాంతాలు పూర్తిగా వ్యూహాత్మక బలగాల మోహరింపుతో నిండిపోయాయి. వనపర్తి, ఆత్మకూరు, అమరచింత, నర్వ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రాజెక్టు వైపు రాకుండా రహదారుల వెంట వాహన తనిఖీలు చేపట్టారు. మరోవైపు గద్వాలలోనూ కాలువలకు నీటిని విడుదల చేయాలనే డిమాండ్‌తో అఖిలపక్షం, రైతు సంఘాలు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో అక్కడ కూడా నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ముట్టడి పిలుపు, పోలీసుల కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ జూరాల ప్రాజెక్ట్ సమీపంలో హైటెన్షన్ వాతావరణం కొనసాగుతోంది.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు



**నేటి శుభోదయ, ఎర్రవల్లి :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు.

## రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్...
### శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక స్పష్టతనిచ్చింది. పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు కమిషన్ తెరదించింది. సిలబస్ మార్పుపై అభ్యర్థుల నెలకొన్న ఆందోళనలు, వారి నుంచి వెల్లువెత్తుతున్న వినతుల నేపథ్యంలో టీజీపీఎస్సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. సిలబస్ సమీక్ష కోసం ప్రస్తుతానికి ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని టీజీపీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల సిలబస్‌లో ఏవైనా భారీ మార్పులు చేపట్టాల్సి వస్తే, ఆ విషయాన్ని కనీసం ఏడాది ముందే అభ్యర్థులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా అభ్యర్థులు మారిన సిలబస్‌కు అనుగుణంగా సిద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా, ఏవైనా స్వల్ప మార్పులు లేదా చేర్పులు అవసరమైతే, ఆ వివరాలను సంబంధిత ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌తో పాటే వెల్లడిస్తామని వివరించారు. సిలబస్ మార్పుపై అభ్యర్థులు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కమిషన్ ఇచ్చిన ఈ స్పష్టతతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఊరట లభించినట్లయింది.

## ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..
### పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ.. బారికేడ్లు తొలగింపు!

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనం అంశం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హుస్సేన్‌సాగర్‌లో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదంటూ అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. దీంతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ తోపులాటలో కొందరు పోలీసులు కిందపడిపోయినట్లు సమాచారం. అప్రమత్తమైన ఉన్నతాధికారులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే పర్యావరణ పరిరక్షణ కోసం హుస్సేన్‌సాగర్‌లో, ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల నిమజ్జనాన్ని నియంత్రిస్తున్నట్లు జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై నుంచి విగ్రహాలను నేరుగా సాగర్‌లో వేయకుండా 10 అడుగుల రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిమజ్జనం నిషిద్ధమంటూ ఫ్లెక్సీలను కూడా పెట్టారు. అయితే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో మట్టి, పర్యావరణ హిత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కొలనులను (బేబీ పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ ఈ ఏర్పాట్లను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్యాంక్‌బండ్ అనేది సంప్రదాయ నిమజ్జన ప్రాంతమని, అక్కడే కార్యక్రమానికి అనుమతించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోతే తామే సొంతంగా క్రేన్లు తెచ్చి నిమజ్జనాలు చేస్తామని ఆదివారమే హెచ్చరించింది. మొత్తంమీద ఒకవైపు కోర్టు ఆదేశాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు, మరోవైపు సంప్రదాయం పేరుతో ఉత్సవ సమితి పట్టుదల మధ్య హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం అంశం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఈ ప్రతిష్ఠంభన ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని నగరవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్న మాజీ మావోయిస్టులు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ దశాబ్దాల సామాజిక, రాజకీయ ఆకాంక్షలకు, ఉద్యమ భావజాలానికి ప్రాతిపదికగా రాష్ట్ర రాజకీయ యవనికపై త్వరలోనే నూతన పార్టీ ఆవిర్భవించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. దాదాపు ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమాల్లో చురుగ్గా పనిచేసి, తదనంతరం సామాన్య జీవితంలోకి అడుగుపెట్టిన మాజీ మావోయిస్టులే ప్రధాన చోదకశక్తిగా 'జన తెలంగాణ పార్టీ' రూపుదిద్దుకుంటోంది. లంకా పాపిరెడ్డి (ల చ్చన్న), అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్, గురిజాల రవీందర్‌రావులతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యుదయవాదులు, పౌరహక్కుల ఉద్యమకారులు ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే, ఆపరేషన్ కగార్ అనంతర పరిణామాల్లో బయటకు వచ్చిన దేవ్‌జీ – సంగ్రామ్ లేదా సోనూ – ఆశన్న వర్గాలు ఈ పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావడం లేదని తెలుస్తోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానంలోకి అడుగుపెడుతున్న ఈ కొత్త పార్టీ, త్వరలో జరగనున్న వరంగల్–ఖమ్మం–నల్లగొండ... హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. భారీ ప్రాజెక్టులు, జీడీపీ గణాంకాలే అభివృద్ధి కాదని, సామాన్యులకు ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, ప్రశ్నించే స్వేచ్ఛే అసలైన అభివృద్ధి ప్రామాణికాలని తమ విధానపత్రంలో పొందుపరచనున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పుష్కరకాలమైనా ప్రజా సమస్యలు తీరలేదన్న అభిప్రాయంతో ఉన్న ఈ బృందం, త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పార్టీ నమోదు కోసం అధికారికంగా దరఖాస్తు చేయనుంది.

# 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 'ఇందిరమ్మ ప్లాట్ల'ను వెంటనే కేటాయించాలి సిరికొండ ప్రజల డిమాండ్





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మండలంలోని సిరికొండ గ్రామంలో దాదాపు 20 సంవత్సరాల క్రితం నిరుపేదలకు మంజూరై, నేటికీ పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ప్లాట్లను వెంటనే అర్హులైన లబ్ధిదారులకు కేటాయించి న్యాయం చేయాలని సోమవారం ప్రజా పాలనలో స్థానిక అర్హులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా బాధితులతో కలిసి అధికారులను కలిసిన గ్రామ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ మాట్లాడుతూ .. గతంలో ప్రభుత్వం అందించిన నిధులు సరిపోకపోవడంతో, గ్రామానికి చెందిన పేద ప్రజలు ఒక్కొక్కరు ₹2,000 చొప్పున జమ చేసి స్థలం/భూమి కొనుగోలు చేయడం జరిగింది. ఆ సమయంలో అధికారులు వారికి పట్టా సర్టిఫికెట్లు కూడా అందజేశారని, కానీ ఇప్పటివరకు ఆ భూమిలో ప్లాట్లను ఎంపిక చేసి సర్వే నిర్వహించి సరిహద్దులు నిర్ణయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కొందరు స్వర్ధపరుల వల్ల ఈ బాధితులకు తీరని అన్యాయం జరిగింది.అనర్హులను కూడా బాధితుల లీస్ట్ లో పేర్లు చేర్చటం వల్లనే ప్లాట్ లు సరిపోకపోవడంతో అధికారుల కు పలుపోకనే హద్దు లు చూపలేదని అర్హులైన బాధితులు గత రెండు దశాబ్దాలుగా ప్లాట్ల కోసం నిరీక్షిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే సర్వే చేపట్టి అర్హులైన నిరుపేదలకు ప్లాట్లను ఎంపిక చేసి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

# మైలారం గ్రామంలో భూ ఆక్రమణలపై సర్వే నిర్వహించి, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల డిమాండ్





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** సిరికొండ మండలం మైలారం గ్రామంలోని సర్వే నంబర్ 288లో ఉన్న భూమి ఆక్రమణకు గురవుతోందని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి హద్దులు నిశ్చయించాలని గ్రామస్తులు, గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ ) సభ్యులు కోరారు.గత కొన్ని సంవత్సరాలుగా ఈ భూమిని గ్రామానికి చెందిన పశువుల మేత కోసం, ఇతర పబ్లిక్ అవసరాల కోసం ఉమ్మడిగా ఉపయోగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే ఇటీవల కొందరు పట్టాదారులు సదరు భూమిని ఆక్రమించడంతో, గ్రామంలో పశువులను మేపడానికి కూడా స్థలం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై గ్రామంలో అంతర్గతంగా చర్చించుకుని, భవిష్యత్తులో ఎలాంటి భూకబ్జాలు జరగకుండా శాశ్వత పరిష్కారం చూపాలనే ఏకగ్రీవ తీర్మానానికి వచ్చామని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి, సదరు సర్వే నంబర్ భూమికి రీ-సర్వే నిర్వహించి, కచ్చితమైన హద్దులను నిర్ధారించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామ ప్రజలు ప్రజా పాలనలో అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలకు శుభం కలగాలి విష్ణువర్ధన్ యాదవ్

- **భవాని మాత ఆలయంలో ప్రత్యేక పూజలు... అంబేద్కర్ యూత్ అసోసియేషన్ వినాయకుడి దగ్గర అన్నప్రసాద వితరణ**






**తలకొండపల్లి, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** హలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని శ్రీ భవానీమాత ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీ విఘ్నేశ్వర మహారాజ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈనాడు విలేఖరి సీహెచ్ విష్ణువర్ధన్ యాదవ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ సందర్భంగా విష్ణువర్ధన్ యాదవ్ మాట్లాడుతూ..విఘ్నేశ్వరుడు విఘ్నాలను తొలగించే దేవుడని, ప్రతి శుభకార్యానికి ముందుగా గణపతిని పూజించడం మన సంప్రదాయమని తెలిపారు.అనంతరం అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రతిష్టించిన గణపతి కి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించి గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో యువ నాయకుడు వానరాసి వెంకటేష్, మాదాయిపల్లి సర్పంచ్ సుధాకర్, మాజీ ఎంపీటీసీ అంబాజీ,మాజీ వార్డ్ సభ్యులు శివ విజయ్ కుమార్,వార్డ్ సభ్యులు,శేఖర్ యాదవ్,ఆంజనేయులు,శ్రీశైలం,సుభాన్,చేన్న కేశవ,దుబ్బ ఎల్లమ్మ,శ్రీ భవానీమాత ఉత్సవ కమిటీ సభ్యులు,అంబేద్కర్ యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు,చురుగ్గా పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

# టిజేజేఏసీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా గుగులోత్ భావుసింగ్ నాయక్.

- **జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి**




**ఏన్కూరు, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా గార్లఒడ్డుకు చెందిన గుగులోత్ భావుసింగ్ నాయక్ నియమితులయ్యారు. ఆయనను టి జే జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తొంగరి కరుణాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడిగా నియమించారు.ఈ సందర్భంగా గుగులోత్ భావుసింగ్ నాయక్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. తన పై రాష్ట్ర కమిటీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ టి జే జెఏసి ను జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని గుగులోత్ భావుసింగ్ నాయక్ పేర్కొన్నారు.

# ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం




**నిజామాబాద్ రూరల్ డిచ్ పల్లి, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** డిచ్పల్లి మండలంలో ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం సాధించిన సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం ఉత్సాహంగాడాక్టర్ బి ఆర్ అంబేద్కర్ మరియు వివేకానంద గారి ప్లెక్సీ తో సంబరాలు నిర్వహించారు.నాలుగు ప్రధాన పోస్టుల్లో మూడు స్థానాలను ఏబీవీపీ కైవసం చేసుకుంది. అధ్యక్షుడు, కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ స్థానాల్లో ఏబీవీపీ అభ్యర్థులు విజయం సాధించడంతో విద్యార్థులు టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు.

# ధర్పల్లి మండలంలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీ కులబంధువులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాపూజీ సమాజానికి చేసిన సేవలను, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన సాగించిన పోరాటాన్ని స్మరించుకుంటూ కొనియాడారు. బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కులబంధువులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుడికి కుటుంబ సమేత ప్రత్యేక పూజలు

- **ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో శంబాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాధునికి ప్రముఖ సంఘ సేవకుడు బజారు బిక్షపతి దంపతులు సోమవారం కుటుంబ సమేతంగా ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రతి ఏటా వినాయక చవితి వేడుకలు జరుపుకుంటామని యూత్ సభ్యులు తెలిపారు.భక్తి శ్రద్ధలతో పాటలు భజన కార్యక్రమాలు,కోలాటాలు కార్యక్రమాలు నిర్వహిస్తామనీ అన్నారు.గణనాథుని ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆ గణనాథుని వేడుకున్నట్లు తెలిపారు. అలాగే వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని,వినాయకుని వేడుకున్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బజార్ బిక్షపతి,బలమని నవదీప్ ,రాకేష్ పుష్పమ్మ ,బీరప్ప,స్వప్న యూత్ సభ్యులు, కే మహేందర్ ,శ్రీకర్ సతీష్ ,ఈ మహేందర్ ,శివ ,శంకర్ నగేష్ ,సాయి ,ఆంజనేయులు,ఈ శ్రీనివాస్ ,బన్నీ ,కుమార్,ఏ మహేందర్ ,సిహెచ్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి తన్విత శ్రీ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే.




**ఏన్కూర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** జూలూరుపాడు మండల పరిధిలోని వినోబా నగర్ గ్రామానికి చెందిన సర్పంచ్ గంగావత్ నవీన్ కుమార్తె చిన్నారి తన్విత శ్రీ అకాల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి సర్పంచ్ నవీన్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు."ఇలాంటి విషాద సమయంలో మాటలతో ఓదార్చడం కూడా కష్టం. ఈ బాధను తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని ఆమె ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాగేశ్, గంగావత్ గోరియా, బానోత్ రవి, గంగావత్ లింగ, భూక్యా చందు, మాలోత్ నాగేశ్వరరావు, గంగావత్ రవి, గంగావత్ నరేంద్ర, గంగావత్ ప్రసాద్, బానోత్ రామ, బానోత్ పంతులు, బానోత్ నాన్య బిఆర్ ఎస్ నాయకులు మందడపు శంకర్ రావు, రాజు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# పాలిటెక్నిక్ పోరాటం ఫలించింది

- **విలీన ప్రతిపాదనపై ప్రభుత్వం వెనక్కి తగ్గడం హర్షణీయం: మెతుకు ఆనంద్**



**వికారాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** వికారాబాద్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయంలో విలీనం చేయాలన్న ప్రతిపాదనపై ప్రభుత్వం వెనక్కి తగ్గడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు 35 రోజులుగా శాంతియుతంగా సాగించిన పోరాటం ఫలించిందని తెలిపారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగడం, సాంకేతిక విద్యాశాఖ కమిషనరేట్, రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి యథాతథంగా కొనసాగనున్నట్లు స్పష్టత రావడం విద్యార్థులకు ఊరటనిచ్చే అంశమన్నారు. డిప్లొమా కోర్సులు, పరీక్షలు, విద్యా విధానాల్లో అనవసర మార్పులు చేయకుండా ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. అధ్యాపకుల సహాయ నిరాకరణ కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో కీలకంగా నిలిచిందన్నారు. విద్యార్థుల విద్య, ఉపాధి అవకాశాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం స్పష్టమైన విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు.

# రూ.71 వేలతో వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్న సాదుల కరుణాకర్ రెడ్డి




**శామీర్‌పేట్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లో ఫార్మేట్స్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఏడు రోజుల పాటు వినాయక మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఏడో రోజు ప్రత్యేక పూజల అనంతరం వినాయకుడి లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో సాదుల కరుణాకర్ రెడ్డి రూ.71 వేలతో లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహంతో ఘనంగా శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేపట్టారు.ఈ కార్యక్రమంలో రామాలయం మాజీ చైర్మన్ డి.గోపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బి.కొండల్ రెడ్డితో పాటు బి.బుచ్చి రెడ్డి, బి.శేఖర్ రెడ్డి, డి.గోవింద్ రెడ్డి, వి.మురళి గౌడ్, యం.సాయి కుమార్, యం.శివాజీ, బి.నాగిరెడ్డి, యం.నర్సింగ్ రావు, యం.కిషన్, సి.రవీందర్ రెడ్డి, డి.వీరేందర్ రెడ్డి, బి.మహిపాల్ రెడ్డి, యం.రాజు తదితరులు పాల్గొన్నారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

# 31వ వార్డులో అపరిశుభ్రత.. చెత్త డంపింగ్ యార్డుగా మారిన ప్రాంతం




**వికారాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** వికారాబాద్: పట్టణంలోని 31వ వార్డు కే. రాజయ్య ఇంటి వెనుక ప్రాంతంలో అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంది. ఇళ్ల నుంచి వెలువడుతున్న చెత్తను ఒకేచోట పేరుకుపోయేలా వదిలేయడంతో ఆ ప్రాంతం క్రమంగా చెత్త డంపింగ్ యార్డుగా మారుతోంది. చెత్త కుప్పలు, వ్యర్థ పదార్థాలతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెత్త తొలగింపు, పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ సిబ్బంది, అధికారులు దృష్టి సారించకపోవడంతో సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో చెత్తతో పాటు మురుగునీరు నిలిచిపోయి దోమలు, ఈగలు వృద్ధి చెందే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో పరిసరాల్లో నివసించే ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు, భవిష్యత్తులో అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వార్డు ప్రజాప్రతినిధులు కూడా సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి సారించాలి

- **పత్రికల్లో ప్రచురితమయ్యే సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి**
- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, ప్రజావాణి ద్వారా అందే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు.జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, విజ్ఞప్తుల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపట్టాలని అన్నారు.అదేవిధంగా జిల్లాలోని సమస్యలకు సంబంధించి వార్తాపత్రికలు, ఇతర మాధ్యమాల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. పత్రికల్లో ప్రచురితమైన సమస్యలను కేవలం వార్తలుగా కాకుండా ప్రజల సమస్యలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలుగా పరిగణించి, వాటి వాస్తవ పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.విద్య, వైద్యం, గృహ నిర్మాణ శాఖలపై ప్రత్యేక దృష్టిజిల్లాలో విద్య, వైద్య, గృహ నిర్మాణ తదితర శాఖలకు సంబంధించిన పలు సమస్యలు ప్రజల దృష్టికి వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలకు కారణాలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలలు, విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని, మందులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు.గృహ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు, గృహ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమస్యల పరిష్కారానికి వ్యవస్థీకృత కార్యాచరణ ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి పరిశీలించి, దాని పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని, బాధ్యతను నిర్ణయించుకుని, నిర్ణీత గడువులో పరిష్కరించే విధంగా వ్యవస్థీకృతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఒకే సమస్య పదేపదే ప్రజావాణిలో రావడం లేదా పత్రికల్లో ప్రతికూల వార్తగా ప్రచురితం కావడం జరగకుండా అధికారులు ముందస్తుగా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- **అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి**



**వికారాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం జాప్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు.సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, పౌరసరఫరాలు, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 106 దరఖాస్తులు ఈ సందర్భంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు వేగంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజావాణి ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలనను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీమయమైన బోనకల్,హోరెత్తిన భారీ బైక్ ర్యాలీ

- కాంగ్రెస్ రాజ్యంలో కౌరవ పాలన,బిఆర్ఎస్ హయాంలో స్వర్ణయుగం
- బోనకల్ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన లింగాల కమల్ రాజు
- బోనకల్ బీఆర్ఎస్ కార్యాలయం జనతా గ్యారేజ్.. ప్రజల కోసం పనిచేసే పోరాట కేంద్రం :- లింగాల కమల్ రాజు






**బోనకల్ , సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** బోనకల్ బీఆర్ఎస్ నూతన మండల పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో బోనకల్ పట్టణం గులాబీమయమైంది. బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రావినూతల నుండి బోనకల్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీతో పుర వీధులు హోరెత్తాయి.. గులాబీ జెండాలు రెపరెపలాడుతుండగా, పార్టీ నినాదాలతో ప్రధాన వీధులు మార్మోగాయి.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో లింగాల కమల్ రాజు మాట్లాడుతూ బోనకల్‌లో ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కేవలం పార్టీ కార్యకలాపాలకు పరిమితమైన కార్యాలయం కాదని, ప్రజల కోసం పనిచేసే "జనతా గ్యారేజ్", ప్రజా సమస్యలపై పోరాడే పోరాట కేంద్రంగా ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు.ప్రజలు తమ సమస్యలతో ఎప్పుడైనా పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిపై అవసరమైన పోరాటాలు నిర్వహించేందుకు ఈ కార్యాలయం కేంద్రంగా నిలుస్తుందని చెప్పారు"ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలను నయవంచన చేశారని,ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తున్నారు అని కమిషన్లతో కాలం గడుపుతున్నారని ఆయన మండిపడ్డారు.ప్రజల సమస్యలు, రైతులు, యువత, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం మరింత స్పష్టతతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే,తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారు అని కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని కమల్ రాజు అన్నారు.కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.బోనకల్ నూతన పార్టీ కార్యాలయం ద్వారా మండలంలోని ప్రతి గ్రామంతో పార్టీకి మరింత బలమైన అనుసంధానం ఏర్పడుతుందని కమల్ రాజు అన్నారు. ప్రజలకు అన్యాయం జరిగిన ప్రతిసారీ బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల పక్షాన నిలబడతాయని స్పష్టం చేశారు"ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా ఉంటాం.. ప్రజలకు అండగా నిలుస్తాం.. అవసరమైతే ప్రజల కోసం రోడ్డెక్కి పోరాటం చేస్తాం" అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసీ బానోత్ కొండ, గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, పార్టీ మండల నాయకులు పారప్రసాద్, వేమూరి ప్రసాద్ ,జంగా రవి, మోదుగుల నాగేశ్వరరావు, బంధం నాగేశ్వరరావు, కాకాని శ్రీనివాసరావు ,గద్దల వెంకటేశ్వర్లు ,ఇటికాల శ్రీనివాసరావు ,చొప్పకట్లపాలెం హుస్సేన్ భాయ్, ఆలపాడు సర్పంచ్ నాగేశ్వరరావు, లక్ష్మీపురం సర్పంచ్ బోనకల్ సర్పంచ్ తన్నీరు పుల్లారావు, వడ్డే నరేష్, కొనకంచి నాగరాజు, జెర్రిపోతుల రవి, గుండపునేని సుధాకర్ ,చావా హనుమంతరావు ,బెజవాడ మల్లికార్జున్ ,కొమ్మినేని ఉపేందర్, మడావత్ సైదా నాయక్, తేలూరు రమేష్, యార్లగడ్డ రమేష్, మోర్ల శ్రీను, గంగుల పుల్లయ్య, మరిదు శేషు, షేక్ మేరా సాహెబ్, యోగి శ్రీనివాస్, తాళ్లూరు జ్యోతి, జర్పుల లావణ్య, గ్రామ శాఖ సభ్యులు ,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు

# అనంతారంలో అల్జీమర్స్‌పై అవగాహన కార్యక్రమం

- మతిమరుపు లక్షణాలను తొలిదశలో గుర్తించి వైద్యులను సంప్రదించాలి: ప్రాజెక్ట్ ఇన్‌చార్జి





**శామీర్‌పేట్లి, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్జీమర్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐజీఎఫ్ స్వచ్ఛంద సంస్థ, దాట్ల ఫౌండేషన్ బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ సహకారంతో అనంతారం వార్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఐజీఎఫ్ శామీర్‌పేట ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఎల్లబోయిన సాంబరాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సాంబరాజు మాట్లాడుతూ.. అల్జీమర్స్ వంటి తీవ్రమైన మతిమరుపు వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడు చింతలపల్లి, శామీర్‌పేట మండలాల పరిధిలోని వివిధ వార్డుల్లో అల్జీమర్స్‌పై అవగాహన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక జీవన విధానంలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యలు, జీవనశైలి వ్యాధులతో పాటు వృద్ధాప్య సమస్యలు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.అల్జీమర్స్ బారినపడిన వారిలో జ్ఞాపక శక్తి క్రమంగా తగ్గడం, చిరాకు, కోపం, ఆందోళన, ఒకే పనిని పదేపదే చేయడం, కుటుంబ సభ్యులను గుర్తించలేకపోవడం, ఇంటికి వెళ్లే దారి మరిచిపోవడం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉందన్నారు. ఇటువంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా కుటుంబ సభ్యులు ముందుగానే గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు.గతంలో మెదడును చురుగ్గా ఉంచే పుంజితం, పులిమేక, పచ్చీస్, కైలాసం, పదాలు పూరించడం, చదరంగం, పజిల్స్ వంటి ఆటలు ఆడేవారని, ప్రస్తుతం కూడా వయసుకు తగిన విధంగా ఆలోచనను, జ్ఞాపక శక్తిని పెంపొందించే కార్యక్రమాల్లో వృద్ధులు పాల్గొనాలని సూచించారు. అల్జీమర్స్ బాధితులను భారంగా కాకుండా మానవతా దృక్పథంతో ఆదరించి, వారికి కుటుంబ సభ్యులు అండగా నిలవాలని కోరారు.సంస్థ వైద్యులు డాక్టర్ ఈశ్వర్ నాయక్ మాట్లాడుతూ.. డిమెన్షియా, అల్జీమర్స్ వంటి వ్యాధులకు మెదడు కణాల క్షీణత, జన్యుపరమైన కారణాలు, జీవనశైలి సంబంధిత సమస్యలు తదితర అంశాలు కారణమయ్యే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి వైద్యులను సంప్రదిస్తే అవసరమైన పరీక్షలు, చికిత్స ద్వారా లక్షణాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సమతుల పౌష్టికాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మెదడును చురుగ్గా ఉంచే ఆలోచనా ఆటల్లో పాల్గొనడం, చురుకైన జీవనశైలిని కొనసాగించడం ఆరోగ్యానికి ఉపయోగకరమని వివరించారు.కార్యక్రమంలో అనంతారం వార్డు ప్రజలు ఆకుల బాలరాజ్, ముద్దం పాపిరెడ్డి, సలేంద్రి రాజమల్లయ్య, ముద్దం పెంటమ్మ, కాశిపురి కృష్ణాచారి, బలిపురం ఎల్లమ్మ, బత్తిని భారతమ్మ, అమీనా బీ తదితరులు పాల్గొన్నారు. సంస్థ సిబ్బంది పుట్ట గణేష్‌కుమార్, పొన్నబోయిన బాలేష్, ఇల సాగర్ శ్రీకాంత్ పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇల్లు.. ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవం



**ఇల్లందు, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** టేకులపల్లి మండలం మూడ్ తండా గ్రామంలో మూడ్ మాలతీ – గోపి దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ పనులకు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు.ఈ సందర్భంగా మాలతీ – గోపి దంపతులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోరం సురేందర్ మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద కార్యక్రమం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రేగళ్ల సతీష్ రెడ్డి



**కాప్రా, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో స్టార్ యూత్ బ్రదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ నియోజకవర్గం కో–కన్వీనర్ రేగళ్ల సతీష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడిని దర్శించుకుని, ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందించారు.వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని వారు కోరారు.కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కాప్రా డివిజన్ ప్రతినిధులు నాగునూరి మహేష్, కొప్పుల కుమార్, గడ్డం సత్యనారాయణ, గుండె కృష్ణ, గుడి శ్రీకాంత్‌తో పాటు స్టార్ యూత్ బ్రదర్స్ సభ్యులు వికాస్, అజయ్, రాకేష్, జగదీష్, తేజ, శ్రీకాంత్, మధు, సాయి, పృధ్వి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 111 ఫిర్యాదులు




**నిజామాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 111 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు,అదనపు కలెక్టర్ భుజంగరావు,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,డీపీఓ శ్రీనివాస్,ట్రైనీ ఆర్డీఓ సందీప్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిన్నతనంలోనే అనారోగ్యం.. కుటుంబాన్ని ఆదుకోవాలి



**కేశంపేట, సెప్టెంబర్ 21 , నేటి శుభోదయ :** మండల పరిధిలోని కాకునూరు గ్రామానికి చెందిన అనుపటి కృష్ణ (36) అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాక్టర్ డ్రైవర్గా పనిచేస్తూ భార్య, కుమార్తెను పోషించిన కృష్ణ.. కష్టపడి సొంతంగా ట్రాక్టర్ను కొనుగోలు చేసుకుని కుటుంబాన్ని సంతోషంగా చూసుకునేవాడు. అయితే ఏడాది క్రితం షుగర్ వ్యాధి బారి నపడటంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. అనారోగ్యంతో రెండు కళ్ల చూపు కోల్పోయారు. అనంతరం కిడ్నీలు దెబ్బతినడంతో ప్రస్తుతం మంచానికే పరిమితమయ్యారు.కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తే అనారోగ్యానికి గురికావడంతో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కృష్ణకు రెండు రోజులకు ఒకసారి డయాలసిస్ చేయించాల్సి వస్తోంది. ఇందుకోసం బాలానగర్కు వెళ్లాల్సి ఉంటుంది. చూపు లేకపోవడంతోపాటు సొంతంగా నడవలేని పరిస్థితిలో ఉండటంతో కుటుంబ సభ్యుల సహాయం తప్పనిసరిగా మారింది.చికిత్స, డయాలసిస్ ఖర్చులు భరించలేక కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కృష్ణకు మెరుగైన వైద్యం అందించేందుకు దాతలు, దయగల హృదయులు తమ వంతు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఆర్థిక సహాయం అందించాల్సిన ఫోన్పే నంబర్: 63023 85725

# వెల్జాల్ లో ఇళ్ల నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చేయూత

- **బి ఆర్ ఎస్ యువ నాయకుడు వారణాసి వెంకటేష్**



**తలకొండపల్లి, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో పేద కుటుంబాల ఇళ్ల నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించింది.మండలంలోని వెల్జాల్ గ్రామానికి చెందిన మీడత శ్రీశైలం ఇంటి స్లాబ్ నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇనుమును ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు.అదే గ్రామానికి చెందిన పోషమోని మంగమ్మ ఇంటి ఫినిషింగ్ పనులకు అవసరమైన 50 బస్తాల సిమెంట్ను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అందించారు. ఈ సందర్భంగా సహాయం అందించిన ఉప్పల వెంకటేష్కు శ్రీశైలం, మంగమ్మ కృతజ్ఞతలు తెలిపారు.పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణంలో అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు వానరాసి వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు విజయ్ కుమార్, వార్డు సభ్యులు వట్టేల శేఖర్, సుభాన్, నాయకులు దుబ్బ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# తలకొండపల్లి బీజేపీ మండల అధ్యక్షుడిగా ఫైర్ బ్రాండ్ "నీలకంఠ పాండు"





**తలకొండపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ తలకొండపల్లి మండల నూతన అధ్యక్షుడిగా నీలకంఠ పాండు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ ఆయనకు బీజేపీ కండువా కప్పి నూతన మండల అధ్యక్షుడిగా ప్రకటించారు.తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన నీలకంఠ పాండుకు బీజేపీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యమ నాయకుడిగా ఆయన చేసిన సేవలను గుర్తించి పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా సముచిత గౌరవం దక్కిందని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నీలకంఠ పాండు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో బీజేపీని మండలంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నీలకంఠ పాండును పార్టీ నాయకులు,కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెక్కల లక్ష్మణ్, మాజీ మండల అధ్యక్షుడు రవి గౌడ్, వెంకట్రావుపేట సర్పంచ్ ఈ. మహేష్, పోతుగంటి మహేష్, వెంకటేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# తన్విత వైద్యానికి రూ.6 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ

- **పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోంది: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్రెడ్డి**



**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 21 , నేటి శుభోదయ :** అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి తన్విత వైద్య చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.6 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. బొల్లారం ప్రాంతానికి చెందిన నరేష్ కుమార్తె తన్విత అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతోంది. చికిత్సకు అయ్యే ఖర్చును భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని దరఖాస్తు చేసుకున్నారు.కుటుంబ సభ్యుల విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలించి రూ.6 లక్షల విలువైన ఎల్ఓసీని మంజూరు చేసింది. ఈ మేరకు మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.6 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని తన్విత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్రెడ్డి మాట్లాడుతూ.. ఖరీదైన వైద్య చికిత్సలను చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం వైద్య ఖర్చుల భారాన్ని కొంతమేర తగ్గిస్తుందని తెలిపారు. తన్విత త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు.అర్హులైన పేద కుటుంబాలు వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, నార్ల సురేష్, ప్రశాంత్రెడ్డి, నర్సింగరావు, బషీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ,ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- **అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులు తక్షణమే పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన రాష్ట్ర మంత్రులు,సీఎస్**







**నిజామాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** నీటి పారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ,అటవీ భూముల పరిహారం,ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ,అటవీ భూముల పరిహారం,ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ....నీటి పారుదల ప్రాజెక్టులకు అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు.2026–27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు.ఇప్పటికే రూ.1,050 కోట్లు,మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు గుర్తు చేశారు.అయితే విడుదలైన నిధుల్లో సింహభాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి,లబ్ధిదారులకు అందించకపోవడం పట్ల ఒకింత చేరకపోవడం ఆందోళన వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు.నిధులు చాలకపోయినా,ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోతే ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని,ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని సకాలంలో భూసేకరణ పూర్తి చేయాలని మంత్రి సూచించారు.భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు,అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.కలెక్టర్లు,ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ....ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు.నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి,పనులను వేగవంతం చేయాలని అన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ....ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ,ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా,రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ భవేష్ మిశ్రా,అదనపు కలెక్టర్ భుజంగరావు,నిజామాబాద్,బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్,విజయ కుమారి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐడిఓసి కాంప్లెక్స్,జిల్లా కోర్టులో బ్రెస్ట్ఫీడింగ్ క్యాబిన్లు ప్రారంభం





**నిజామాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మహిళా శిశు దివ్యాంగుల మరియు వయో వృద్ధుల శాఖ,జిల్లా మహిళా సాధికారిక కేంద్రం (DHEW),బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ఆధ్వర్యంలో తల్లులు తమ శిశువులకు సౌకర్యవంతంగా,గోప్యతతో తల్లిపాలు అందించేందుకు నిజామాబాద్ ఐడిఓసి కాంప్లెక్స్,జిల్లా కోర్టు ప్రాంగణంలో బ్రెస్ట్ఫీడింగ్ క్యాబిన్లు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి గీత,జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి రాజశ్రీ,జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణవేణి,జిల్లా సంక్షేమ అధికారి సౌందర్యలు ప్రారంభించారు.అదేవిధంగా నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బ్రెస్ట్ఫీడింగ్ క్యాబిన్ను మూడవ సెషన్స్ కోర్టు గౌరవ న్యాయమూర్తి ఉషా కిరణ్,నాలుగవ సెషన్స్ కోర్టు గౌరవ న్యాయమూర్తి దుర్గాప్రసాద్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ......ఉద్యోగులు,సందర్శకులు,ఐడిఓసి కాంప్లెక్స్కు వచ్చే తల్లులు తమ శిశువులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పాలిచ్చేందుకు ఈ క్యాబిన్లు ఉపయోగపడతాయని తెలిపారు.శిశువులకు తల్లిపాలు అందించడం వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో ముఖ్యమని,తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా బాలికల సంరక్షణ,విద్య,ఆరోగ్యం,మహిళల సాధికారతకు సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.తల్లులు శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫర్హత్ డిచ్పల్లి సిడిపిఓ,కోర్టు ఏవో గోవిందరావు,సీనియర్ సూపరింటెండెంట్ సెంట్రల్ నాజరత్ ప్రకాష్,శ్రీనివాస్ సూపరింటెండెంట్,మహిపాల్ సీనియర్ అసిస్టెంట్,ప్రణతి ఈఓ,డిహెచ్ఈడబ్ల్యూ–డిఎంసి స్వప్న,జెండర్ స్పెషలిస్ట్లు,స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షి లిటరసీ,అకౌంటెంట్ లు,సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# బస్తీ దవాఖానలో బోరు సమస్య పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**లింగోజిగూడ , సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కామేశ్వర్ రావు కాలనీ నందు ఉన్న బస్తీ దవాఖానలో గత ఆరు నెలలుగా బోరు ఎండిపోవడంతో నీటి సమస్య నెలకొంది. ఈ విషయాన్ని బస్తీ దవాఖాన సిబ్బంది ఎల్బీ నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ బస్తీ దవాఖానకు ప్రతిరోజూ ఎంతోమంది రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారని ఇలాంటి ఆసుపత్రిలో నీటి కొరత ఉండటం వల్ల రోగులు,సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య కేంద్రాల్లో మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.బోరు ఎండిపోవడం వల్ల ఏర్పడిన నీటి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త బోరు ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా బస్తీ దవాఖానల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు



తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో డివిజన్ భారస అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి,నాయకులు తిలక్ రావు,జగన్నాద్ రెడ్డి,గంగపుత్ర భాస్కర్,శ్రీధర్ హాస్పిటల్ సిబ్బంది ప్రశాంతి,సరిత తదితరులు పాల్గొన్నారు.

# రైతు హామీల అమలుకై 27 నుండి బోధన్ టు జగిత్యాల కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర....

- బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి





**నిజామాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** సోమవారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పి.తిరుపతి రెడ్డి అధ్యక్షతన సైకిల్ యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి,జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని,ఆ హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ ఆదేశాల మేరకు బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భారీ సైకిల్ యాత్రను ఈ నెల 27వ తేదీన బోధన్ నుండి ప్రారంభమై,అక్టోబర్ 4వ తేదీన జగిత్యాల వరకు దాదాపు 180 గ్రామాల మీదుగా కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర కొనసాగుతుందని తెలిపారు.ప్రధాన డిమాండ్లు:

షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలి.

- కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపజేయాలి.
- అన్ని రకాల వడ్లకు బోనస్ అందించడంతో పాటు,మేనిఫెస్టోలో పేర్కొన్న 10 రకాల పంటలకు బోనస్ చెల్లించాలి.
- వ్యవసాయ రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సాయం అందించాలి.
- పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలి.
- నిజామాబాద్ నగరంలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలి.
- నిజాం షుగర్ ఫ్యాక్టరీ (బోధన్),ముత్యంపేట్ చక్కెర కర్మాగారాలను తెరిపించాలి.
- రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (FPO) తగిన ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించాలి.రైతుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ సైకిల్ యాత్రలో అన్నదాతలు,పార్టీ శ్రేణులు,ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ....దశాబ్దాల ఇందూర్ రైతాంగ కల అయిన జాతీయ పసుపు బోర్డును ప్రధాని నరేంద్ర మోదీ మంజూరు చేస్తే,రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాలయ నిర్మాణానికి స్థలం ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎరువులపై లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ భరిస్తూ,పీఎం–కిసాన్ ద్వారా ప్రతి ఏటా ఆర్థిక సాయం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది.కానీ,రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు,వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులను మోసం చేస్తుందన్నారు.రైతుల హక్కుల సాధనకై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ సైకిల్ యాత్రలో రైతులు అధిక సంఖ్యలో కదలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కిసాన్ మోర్చ నాయకులు వెల్మ గంగారెడ్డి,అంతిరెడ్డి హరీష్ రెడ్డి,తోట చిన్నయ్య,జిల్లా పదాధికారులు,కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజావాణిలో 31 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బోనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం, మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.పరిశుభ్రమైన వాతావరణం వల్ల అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో ముఖ్యమని తెలిపారు. పాఠశాల విద్యార్థులు కూడా మొక్కల సంరక్షణపై అవగాహన పెంచుకుని, తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.“వ్యాధులు సోకకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం.. పచ్చదనాన్ని పెంచి ఆరోగ్యకరమైన బోనకల్‌ను నిర్మిద్దాం” అని




సర్పంచ్ బానోతు జ్యోతి కొండ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాను కొండ, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లను వెరిఫికేషన్ చేసిన ఎంపీడీవో

**నిజామాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** సోమవారం డొంకేశ్వర్ మండలం తొండకూర్ గ్రామంలో వివిధ రకాల చేయూత పింఛన్ లకు సంబంధించిన 24 పించన్లకు ఇంటింటికి తిరిగి డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేయడం జరిగింది.అర్హులైన పింఛన్ దారులకు పెన్షన్ నివేదిక లో అప్లోడ్ చేయడం జరిగింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లూరి గంగాధర్,ఎంపీడీవో భూక్య లింగం,గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఉపేందర్,కారోబర్ అశోక్,ఫరీద్ ఉన్నారు.



# గణేష్ నిమజ్జనం నేపథ్యంలో వైన్స్ షాపులు బంద్ : పోలీస్ కమిషనర్ వెల్లడి




**నిజామాబాద్ , సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఇందుమూలముగా నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్,ఆర్మూర్,బోధన్ డివిజన్ ల పరిధిలో గల ప్రజలందరికీ తెలియజేయునది సెక్షన్ 20(1) తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారంగా ఏమనగా గణేష్ నిమజ్జనం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలో గల కల్లు దుకాణాలు,డిపోలు,ఐ.ఎమ్.ఎల్ షాప్స్,2–బి బార్స్,క్లబ్బులు,టిడి–1,టి.యస్.బి.సి.ఎల్ మొదలగునవి తేదీ:22–9–2026 ఉదయం 6 గంటల నుండి తేది:23–9–2026 ఉదయం 6 గంటల వరకు మూసి వేయబడును అని తెలిపారు.

# యువ చైతన్య యూత్ గణనాథుడి మడపంలో అన్న ప్రసాదం.

- గ్రామసర్పంచ్ మానిపాటి శోభ కుమార్ ప్రత్యేక పూజలు.





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మంచాల మండలం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భాగంగా ఆరుట్ల గ్రామంలో ఆదివారం రాత్రి యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుని మండపంలో ప్రత్యేక పూజలు చేసిన,ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ కుటుంబ సభ్యులు గ్రామపంచాయతీ పాలకమండలి అనంతరం అన్నదానదాత గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు యువచైతన్య యూత్ వినాయక మండపంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న గ్రామసర్పంచ్ ను పెద్దలను యూత్ సభ్యులు శాలువలతో ఘనంగా సన్మానించారు ఈకార్యక్రమంలో వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్ ,ప్రజాగలం దామర భూపాల్ ,ఉపసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్ వార్డు సభ్యులు మంద మాధవి ,మోహన్ రెడ్డి ,మంకు మమత వినోద్ ,పున్నం రాము ,మాడుగు బాలమని ,కృష్ణగౌడ్ ,మొర్రిపద్మ ఐలయ్య.లాలాగరి మణెమ్మ, సాతిరి సత్యం యువచైతన్య యూత్ సభ్యులు ,మానిపాటి వెంకటేష్, మహేష్ గౌడ్,అంజయ్య ,భాస్కర్ ,గణేష్ ,శ్రీనివాస్ మల్లేష్ ,శేఖర్ ,మధు ,గ్రామపెద్దలు , వివి ధ పార్టీల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళ ఆచూకీపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి




**వికారాబాద్ , సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: మండలంలోని లోనిముజాహిద్‌పూర్ గ్రామంలో గుర్తుతెలియని మహిళ కనిపించడంతో స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. గత రాత్రి నుంచి ఆమె గ్రామంలోనే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే తన పేరు, స్వగ్రామం, కుటుంబ వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారం వెల్లడించడం లేదని పేర్కొన్నారు. ఆమె ఎక్కడి నుంచి వచ్చిందనే విషయం కూడా తెలియరాలేదు.ప్రస్తుతం ఆమె గ్రామంలోనే ఉండటంతో కుటుంబ సభ్యులు లేదా బంధువుల ఆచూకీ కోసం స్థానికులు ప్రయత్నిస్తున్నారు. మహిళను ఎవరైనా గుర్తించినా, ఆమెకు సంబంధించిన వివరాలు తెలిసినా వెంటనే సమీప పోలీసులకు లేదా సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని గ్రామస్తులు కోరారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత: సర్పంచ్ అంజలి భరత్ నాయక్



**వికారాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని దీప్లా నాయక్ తండా సర్పంచ్ అంజలి భరత్ నాయక్ పేర్కొన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని దీప్లా నాయక్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో పయనించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకుంటూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత: సర్పంచ్ అంజలి భరత్ నాయక్



**వికారాబాద్ , సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని దీప్లా నాయక్ తండా సర్పంచ్ అంజలి భరత్ నాయక్ పేర్కొన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని దీప్లా నాయక్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో పయనించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకుంటూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ సురక్ష సంకల్పం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి





**హయత్ నగర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్ నగర్ పాత గ్రామంలోని శ్రీ చక్ర సహిత మహమ్మాయి రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "గణేష్ సురక్ష సంకల్పం" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ అధికారులు గణేష్ ఉత్సవాల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, మహిళల రక్షణకు సంబంధించిన సూచనలు, షీ టీమ్స్ ( She teams) సేవల గురించి వివరించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ...గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి. ప్రజల భద్రతకు పోలీస్ శాఖ చేస్తున్న కృషి అభినందనీయం. ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి. ముఖ్యంగా మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలి.ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ (క్రైమ్ సీఐ )సంతోష్ మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహిళల భద్రతకు సంబంధించిన పలు సూచనలు తెలియజేశారు. షీ టీమ్స్ పనితీరు, మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న పోలీస్ సేవల గురించి వివరించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను సురక్షితంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మీనారాయణ, మరియు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు

## జెండా గుడిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్ కుటుంబం





**నిజామాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** నగరంలోని జెండా బాలాజీ ఆలయాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....వినాయక చవితికి ముందు ఇందూరులో జెండా ఉత్సవాలు నిర్వహించడం సాంప్రదాయమన్నారు.ఎన్నో ఏళ్లుగా తాను జెండా జాతరలో పాల్గొంటున్నానని గుర్తు చేసుకున్నారు.జెండాను నగర పురవీధుల్లో శోభాయాత్రగా ఊరేగింపు తీయడం,బాలాజీ ఆలయంలో వారం రోజుల పాటు పూజించడం ఆనవాయితీ అన్నారు.ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,నాయకులు మారావార్ కృష్ణ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాయన్నగూడ—మొయినాబాద్ రహదారికి మోక్షం దిశగా




**శంషాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాయన్నగూడ—కేబీ దొడ్డి—అండాపూర్ మీదుగా మొయినాబాద్ వెళ్లే ప్రధాన రహదారి సమస్యకు పరిష్కారం లభించే దిశగా అడుగులు పడుతున్నాయి. భూ వివాదం, కోర్టు కేసు కారణంగా రహదారి పనులు నిలిచిపోవడంతో రాయన్నగూడ, కేబీ దొడ్డి, అండాపూర్, సుల్తాన్‌పల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర అవసరాల కోసం చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తన సమక్షంలో సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, ప్రస్తుత సర్పంచ్ ఎల్లని ప్రభాకర్ గౌడ్‌తో కలిసి భూ యజమాని మోసిన్‌తో సానుకూలంగా చర్చలు జరిపారు. భూ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే పూర్తి సహకారం అందిస్తారని హామీ ఇవ్వడంతో పాటు, ప్రజల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులు ప్రారంభించేందుకు మోసిన్ అంగీకరించినట్లు తెలిపారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రహదారి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సుల్తాన్‌పల్లి సర్పంచ్ ఎల్లని ప్రభాకర్ గౌడ్ గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, మల్లికార్జున్ యాదవ్, నజీరుద్దీన్, నర్మాడ రాజు తదితర గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఓయాసిస్ స్కూల్‌లో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష

**శంషాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** శంషాబాద్ మండలం అమ్మపల్లిలోని ప్రముఖ విద్యాసంస్థ ఓయాసిస్ పాఠశాలలో 2వ మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షను ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలో విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ నైపుణ్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ కె. ప్రావల్లిక, వైస్ ప్రిన్సిపాల్ మెటిల్డా ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని, మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఈ లక్షణాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. బెల్ట్ గ్రేడింగ్ పరీక్షకు నాయక్ బుడోకాన్ కరాటే వ్యవస్థాపకులు, అధ్యక్షులు మాస్టర్ పి. గణేష్ నాయక్ చీఫ్ ఎగ్జామినర్‌గా, మాస్టర్ ఎం. వాసుదేవ్ సీనియర్ కోచ్‌గా వ్యవహరించారు. పాఠశాల కరాటే కోచ్ శివ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పరీక్షలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పాఠశాల యాజమాన్యం, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్, తల్లిదండ్రులు, విద్యార్థులకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు.



Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## పాలమాకుల మోడల్ స్కూల్ విద్యార్థినికి స్వర్ణ పతకం




**శంషాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** 4వ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ నేషనల్ వుషు స్వీయ రక్షణ క్రీడా చాంపియన్‌షిప్ పోటీల్లో పాలమాకుల మోడల్ స్కూల్ విద్యార్థిని ఎం. నిహారిక సత్తా చాటి స్వర్ణ పతకం సాధించింది. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రజనీ కుమారి, వుషు కోచ్ సంతోష్ యాదవ్, ఉపాధ్యాయులు నిహారికను ప్రత్యేకంగా అభినందించారు. చిన్న వయసులోనే వుషు క్రీడలో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రజనీ కుమారి మాట్లాడుతూ.. రాబోయే జాతీయ స్థాయి వుషు చాంపియన్‌షిప్ పోటీలు అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2 వరకు చెన్నైలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లోనూ నిహారిక ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కోచ్ సంతోష్ యాదవ్ మాట్లాడుతూ.. నిహారిక క్రమశిక్షణ, పట్టుదలతో నిరంతరం సాధన చేయడం వల్లే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా ఆమెకు అవసరమైన శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు.

## రైతుబంధు కోసం దరఖాస్తు.



**ఏన్కూర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల పరిధిలోనిఆరికా యలపాడు గ్రామానికి చెందిన ఉదారపు నాగేశ్వర రావు రైతుబంధు రావడం లేదని, 1Bలో భూమి వివరాలు చూపించడం లేదని ప్రజావాణిలో ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీకి దరఖాస్తు అందజేశారు.గత కొంతకాలంగా తాహసిల్దార్ కార్యాలయంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ -ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- **కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం డివిజన్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**
- **గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజు ముదిరాజ్ కార్యదర్శి చిందం శ్రీశైలం**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజు ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజ కవర్గం నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్ర భుత్వం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినేతృ త్వం లోని ప్రజాప్రభుత్వం పేదప్రజల సంక్షేమం కొరకు అనేక పథకాలు తీసుకొచ్చిందనిఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో, నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ వార్డుసభ్యులు అనం గల్ల జగన్నాదం మహమ్మద్ ఇమ్రాన్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహగౌడ్ బుట్టి కృష్ణ ముదిరాజ్ కంబాలపల్లి బుగ్గరాములు మార లక్ష్మణ్ కోరే బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య ముదిరాజ్ అంతటి రాజుగౌడ్ మార సురేష్ దాసరమోని రమేష్ మానిపా టి వెంకటేష్ సుంకరి ప్రవీణ్ గౌడ్ ఆరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగల పరమేష్ యూ త్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రావుల నాగరాజు నాయకులు ,ఊదరి నర్సింహ ,ఎన్నిదుల సురేష్ ఆర్ల శ్రీకాంత్, మాడపాకుల యాదగిరి ,నూతనగంటి కృష్ణ, మంకు ప్రవీణ్, బత్తుల రాజు గౌడ్, ఎండి అశ్రఫ్, జిలమోని శ్రీనివాస్ ,తవిటి యాదగిరి,మెకానిక్ శేఖర్ ,నూకం శివ దాసరమోని రాజు, జిలమోని శంకర్ ఆడెపు శేఖర్,జోగు అశోక్ ,దాసరమోని ప్రభాకర్ ఆరుట్ల సోషల్ మీడియా కన్వీనర్ దూసరి రాజుగౌడ్ పాండాల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం





**కేశంపేట, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** శంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో విశ్వకర్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమతి గంగోజి నాగరాణి–గంగోజి ఆచారి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలోని భక్తులు, యువత, మహిళలు, పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమానికి హాజరైన వారు భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించారు.అన్నదానం చేయడం ద్వారా ఆధ్యాత్మిక తృప్తితో పాటు సమాజంలో సేవాభావం, ఐక్యత పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తులకు సేవ చేసే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.విశ్వకర్మ యూత్ అసోసియేషన్ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గంగోజి నాగరాణి–గంగోజి ఆచారి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన దంపతులను అభినందించారు.ఈ కార్యక్రమంలో వడ్ల శ్రీనివాస్ చారి, వడ్ల మహాలింగం, వడ్ల బాలరాజ్, వడ్ల కిరణ్, వడ్ల రఘు చారి, వడ్ల సత్తయ్య, వడ్ల రఘు, వడ్ల వెంకటేష్, శృతి, మంజుల, అనిత, మంజుల, సంతోష, రమణమ్మ, బాలమణి, రమా దేవి, భాగ్యమ్మ, తిరుపతయ్య, లక్ష్మమ్మ, బాలమణి, శ్రావ్య, నందిని, మేఘన, కార్తీక్, భాను, వినయ్, సాయి ,రామకృష్ణ సాయి, శివ, రోహిత్, అభిరామ్, రితీష్, లాస్య, కీర్తన, మోక్షిత్, హిమాన్షు, సోనీ, శ్రావణి, నికిత, సావిత్రి, శివ కుమార్, శేఖర్, గణేష్ కుమార్, సుమన్, శివ కుమార్ రెడ్డి, చైతన్య,తో పాటు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## సురక్షిత,ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరుపుకోవాలి



**ముత్తారం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** గణపతి నవరాత్రులు ముగుస్తున్న సందర్భంగా గణేష్ నిమజ్జనం సురక్షితంగా,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై రవికుమార్ సూచించారు.సోమవారం మండలంలోని పలు వినాయక మండపాల నిర్వాహకులతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై రవికుమార్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూగణేష్ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా పాటించాల్సిన భద్రతా చర్యలు,ట్రాఫిక్ నిర్వహణ,శాంతిభద్రతల పరిరక్షణ వంటి విషయాలపై వివరించారు.నిమజ్జన ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా,ట్రాఫిక్‌కు,ప్రజలకు ఇబ్బందులు కలగకుండాగణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని జరుపుకోవాలని సూచించారు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు పలు వినాయక మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

## కౌకూర్‌లో మురుగు సమస్యలపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** కూర్ ప్రాంతంలో నెలకొన్న మురుగు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక నాయకులు, ప్రజల విజ్ఞప్తి మేరకు హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ అధికారులు సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పెన్షన్‌పురా, హరిజనబస్తీ ప్రాంతాల్లో మురుగునీటి పైపులైన్ల పొంగిపొర్లడం, మురుగునీటి సమస్యలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న అధికారులు.. అవసరమైన కొలతలు తీసుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మురుగు సమస్యలతో పాటు సీసీ రోడ్లు, వీధి దీపాల సమస్యలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు.హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ యాప్రాల్ సెక్షన్ సూపర్‌వైజర్లు శ్రీకాంత్, నవీన్, కాంగ్రెస్ నాయకులు శివరాజ్, స్థానికులు కిరణ్, కృష్ణ, అరవింద్, మనీష్, రాజ్‌కుమార్, ఆరిఫ్, షానవాజ్, అజాజ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బడా గణేష్ వద్ద పూజ, అన్నప్రసాద వితరణ

**షాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** షాబాద్ చౌరస్తాలో ప్రతిష్ఠించబడిన బడా గణేష్ వద్ద హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్, ఏగురి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ,అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారుఈ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్లుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలు భక్తిభావంతో, ఐక్యతను చాటే విధంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమని అన్నారు.హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు లంబడి నర్సింలు, కాంశెట్టి శ్రీనివాస్, గాజుల న వీన్, కొండ ప్రదీప్,తమ్మలి అశోక్,ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు శ్రీనివాస్ పంతులు, కాల్వకొలు వెంకట్ యాదవ్ యువత, భక్తులు పాల్గొన్నారు.





# రూ.1.51 లక్షలకు గణేశుడి లడ్డూ వేలంలో దక్కించుకున్న భాస్కర్ నాయక్ దంపతులు



**మిడ్జిల్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండల కేంద్రంలోని వ్యాపార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశుడి లడ్డూ వేలం పోటాపోటీగా సాగింది. భక్తులు, వ్యాపారులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేలం రసవత్తరంగా కొనసాగింది. చివరకు స్వచ్ఛంద సేవకులు జర్పుల రోజా–భాస్కర్ నాయక్ దంపతులు రూ.1,51,000కు గణేశుడి లడ్డూను దక్కించుకున్నారు.లడ్డూ వేలంలో విజేతలుగా నిలిచిన రోజా–భాస్కర్ నాయక్ దంపతులకు లడ్డూతోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు వెండి వినాయకుడి విగ్రహాన్ని అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణేశుడి ఆశీస్సులు అందరికీ ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.వేలం కార్యక్రమంలో వ్యాపార సంఘం ప్రతినిధులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక వ్యాపారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణేశుడి లడ్డూ వేలం సందర్భంగా భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు.

# మంథనిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**మంథని, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం మంథనిలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని మండల అధ్యక్షుడు ఏ. గోలపు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన సేవలను నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా లక్ష్మీ గణపతి హోమం :నవరాత్రి ఉత్సవాలు



**నాగోల్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం ప్రభాత్ నగర్ లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దానిలో భాగంగా శ్రీ లక్ష్మీ గణపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాల నుంచి శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ట్రస్ట్ బోర్డు సభ్యులు సురేందర్ రెడ్డి, ఎనగంటి సుధాకర్, తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం లక్షి గణపతి హోమం, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ అన్న ప్రసాద వితరణకి 1500 మంది పైగా భక్తులు హాజరైనట్లు తెలిపారు. ఈ బుధవారం నిమజ్జన ఉత్సవాలు ఉంటాయని లడూ వేలం పాట జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మంచి కంటి వెంకటేశ్వర్లు, వర కుమార్, రాజేష్, బండ సురేందర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సుధాకర్ (ఉప్పల్) ప్రభాకర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ పురోహితులు శ్రీధర్ శర్మ, భక్తులు బాలరాజు, బాల్ రెడ్డి, చందు, మరియు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# ఫామ్‌హౌస్ భూములపై కాంగ్రెస్ నేతల ఫోకస్

- **మద్దూరులో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్‌ను పరిశీలించిన కాంగ్రెస్ బృందం**
- **ప్రభుత్వ భూములు, ఇనాం, అసైన్డ్ భూములపై రెవెన్యూ వివరాలు తీసుకుని సీఎంకు నివేదిక ఇస్తామని వెల్లడి**



**షాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ప్రభుత్వ భూములు, అసైన్డ్, ఇనాం భూములను పరిరక్షించే అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా కాంగ్రెస్ నాయకుల బృందం సోమవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరు గ్రామంలోని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించింది. ఉదయం ప్రజాభవన్ నుంచి బయలుదేరిన కాంగ్రెస్ నేతలు మద్దూరుకు చేరుకుని ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూముల వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూముల ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు. గతంలో సాధారణ వ్యవసాయం చేసుకునే స్థితిలో ఉన్న వ్యక్తులకు పదేళ్ల పాలనలో భారీగా ఆస్తులు ఎలా సమకూరాయో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి వివిధ ప్రాంతాల్లో భారీగా భూములు, ఆస్తులు ఎలా సమకూరాయనే అంశంపై సమగ్రంగా విచారణ జరగాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. షాబాద్ మండలం మద్దూరులో ఉన్న ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల్లో కూడా కొన్ని భూములు ఇనాం భూములుగా ఉన్నట్లు రెవెన్యూ అధికారుల నుంచి సమాచారం అందిందని వారు తెలిపారు.

**12 ఎకరాల ఇనాం భూమిపై విచారణకు డిమాండ్**

మద్దూరులోని ఫామ్‌హౌస్‌కు సంబంధించిన సుమారు 50 ఎకరాల భూమిలో దాదాపు 12 ఎకరాలు ఇనాం భూమిగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. అయితే ఈ భూముల హక్కులు, రికార్డులు, యాజమాన్య వివరాలు అధికారికంగా పూర్తిస్థాయిలో నిర్ధారించాల్సి ఉందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా గత పదేళ్లలో ప్రభుత్వ, ఇనాం, అసైన్డ్ భూములకు సంబంధించి జరిగిన ఆక్రమణలపై సమగ్ర పరిశీలన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విలువైన భూముల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రభుత్వ భూములు గుర్తించి ప్రజలకు అందేలా చర్యలు**

ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు తేలితే వాటిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నేతలు తెలిపారు. భూముల రికార్డులను పరిశీలించి, 1950ల నుంచి ఇప్పటి వరకు భూముల హక్కుల్లో జరిగిన మార్పులు, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక అందజేస్తామని చెప్పారు.చట్టపరంగా ప్రభుత్వానికి చెందిన భూములు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయితే వాటిని తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంపద దుర్వినియోగమైందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మంది త్యాగాలు చేస్తే, ఆ ఉద్యమ ఫలితంగా ఏర్పడిన రాష్ట్రంలో కొందరు నాయకులు భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారని విమర్శించారు.

# మృత పోలీసు కుటుంబానికి ఆపన్నహస్తం



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మల్కాజ్‌గిరి కమిషనరేట్ కార్ హెడ్‌క్వార్టర్స్ ఏ–కోయ్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ పీసీ 11729 ఎం. చంద్రశేఖర్ మృతి చెందారు. విధి నిర్వహణలో పోలీసు కుటుంబ సభ్యుడిని కోల్పోయిన వారి కుటుంబానికి మల్కాజ్‌గిరి పోలీసు కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అండగా నిలిచింది.దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం సొసైటీ తరపున డైరెక్టర్ టేకుల రవీందర్‌రెడ్డి రూ.70 వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో కుటుంబానికి అండగా నిలిచి మానవీయతను చాటుకున్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల బాగోగులకు కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

# నూతన ముస్లిం మైనార్టీ కమిటీకి ఘన సన్మానం



**డిండి (గుండ్లపల్లి), సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** డిండి గ్రామ ముస్లిం మైనార్టీ కమిటీ నూతనంగా ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆదివారం డిండి గ్రామంలోని షాదీఖానాలో నూతన కమిటీ సభ్యుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు ఎస్.కె. ఉమర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ పెద్దలు, యువత పాల్గొని నూతన కమిటీ సభ్యులకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.నూతన ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షులుగా ఎం.ఏ. ఖలీమ్, కార్యదర్శిగా ఎం.డి. షబ్బీర్, ఉపాధ్యక్షులుగా ఎం.డి. రషీద్, చాంద్ పాషా, సహాయ కార్యదర్శిగా ఎం.డి. అబ్దుల్, కోశాధికారిగా ఎం.డి. సోహెల్ ఎన్నికయ్యారు.అదేవిధంగా నూతన యూత్ కమిటీ అధ్యక్షులుగా ఎం.డి. నసీర్, ఉపాధ్యక్షులుగా ఎం.డి. అవేస్, ఎం.డి. ఆఫ్నాన్, కార్యదర్శిగా ఎం.డి. సిరాజ్, సహాయ కార్యదర్శిగా ఎం.డి. సమీర్, కోశాధికారిగా ఎం.డి. మహరాజ్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ముస్లిం మైనార్టీల సంక్షేమం, యువత అభివృద్ధి, గ్రామంలో ఐక్యతను పెంపొందించేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామ పెద్దలు నూతన కమిటీకి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# తప్పుడు ప్రచారంపై మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

- **విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచన**

**మంథని, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** తన ఫొటోను ఉపయోగించి నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేశారంటూ మంథనికి చెందిన నాయిని సంతోష్ చేసిన ఫిర్యాదుపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై గోదావరిఖని ఏసీపీ విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించినట్లు నాయిని సంతోష్ తెలిపారు.తన ఫొటోను ఉపయోగించి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.ఇదే అంశంపై రూ.2 లక్షల పరువు నష్టం కేసును న్యాయస్థానంలో దాఖలు చేస్తున్నట్లు నాయిని సంతోష్ వెల్లడించారు. మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు.వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేయడాన్ని చట్టపరంగా ఎదుర్కొంటామని నాయిని సంతోష్ స్పష్టం చేశారు.



TELANGANA HUMAN RIGHTS COMMISSION
DATED THE 10th DAY OF SEPTEMBER, 2026
SR.No.3647 OF 2026
IN
HRC.No. 3356 OF 2026

Present:
Hon'ble Dr. Justice Shameem Akther, Chairperson

Mr. Nayini Santhosh,
R/o. Manthani,
Peddapalli District,
Mobile No.8106190914. ... Complainant

ORDER

Perused the complaint received through post.

2. The grievance of the complainant is that despite submitting written complaints to the Police, Manthani, and the Commissioner of Police, Ramagundam, neither legal action was taken nor FIR has been registered against perpetrators who launched a false, highly defamatory, and character-assassination campaign against him on social media and news media. The complainant further alleges that news articles falsely cited Sub-Inspector Sandeep Kumar ("SI Sandeep Kumar said...") to legitimize these baseless claims, beyond the scope of Crime No.188 of 2026 registered against him. The complainant Seeks an independent inquiry by a senior police officer into the inaction and departmental misconduct of SI Sandeep Kumar, preserve digital and station records, ensure protection against false defamation and grant appropriate relief/compensation.

3. Having regard to the nature of allegations and the material placed on record, in view of the powers vested in the Commission under Section 18 of the Protection of Human Rights Act, 1993, the following recommendation is made:-

## ముందస్తు సమాచారం లేకుండానే వేలంపాట

**శంషాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఘన్సీమియాగూడలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్వహణపై గ్రామస్తులు అధికారుల దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. ఆలయానికి సంబంధించిన ఆదాయ వనరులు, దుకాణాల నిర్వహణ, వేలంపాటలు తదితర విషయాల్లో స్పష్టమైన విధానాన్ని రూపొందించి, గ్రామస్తులకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత కొంతకాలంగా ఆలయానికి పూర్తిస్థాయి పాలక వ్యవస్థ లేకపోవడంతో నిర్వహణకు సంబంధించి సందేహాలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయానికి చైర్మన్‌ను నియమించడంతో పాటు, స్థానికుల భాగస్వామ్యంతో నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆలయ పరిధిలోని కొబ్బరికాయల కొట్టు, టెంట్‌హౌస్ తదితర ఆదాయ వనరులకు సంబంధించి చేపట్టే ప్రక్రియను ముందుగానే బహిరంగంగా ప్రకటించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వేలంపాటల ద్వారా వచ్చే ఆదాయం ఆలయ అభివృద్ధికి వినియోగించే విధంగా పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎన్ ఎస్ యు ఐ నాయకుడు జిల్లా ఆనంద్ మాట్లాడుతూ ఆలయ నిర్వహణ విషయంలో గ్రామస్తుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముందుగా పాలక కమిటీని ఏర్పాటు చేసి, ఆ తర్వాత ఆలయ ఆదాయ వనరులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటే ఎలాంటి అపోహలకు అవకాశం ఉండదన్నారు, గ్రామస్తులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన తర్వాతనే వేలంపాట వెయ్యాలని అన్నారు. ఆలయ అభివృద్ధి,



భక్తుల సౌకర్యాలు, ఆదాయ వ్యయాల నిర్వహణపై స్పష్టమైన విధానం రూపొందించాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

## గణేష్ నిమర్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ ఖుష్బూ గుప్త

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మహబూబ్ నగర్ కలెక్టర్ కార్యాలయంలో గణేష్ మండపం వద్ద నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్త ముఖ్య అతిథిగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని అందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్త మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు చెరువుల్లో నీటి లభ్యత తగ్గిపోయిందని తెలిపారు. దీంతో గణేష్ నిమజ్జనాల కోసం చిన్న విగ్రహాలకు అనుకూలంగా ప్రత్యేకంగా బేబీ పాండ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు, ప్రజలు నిమజ్జన కార్యక్రమాల్లో అధికారుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు.గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు పరస్పరం సమన్వయంతో పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, నిమజ్జన సమయంలో భద్రతా చర్యలను పాటించాలని కోరారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.కలెక్టరేట్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు



కలెక్టర్ హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

## రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి-మండల వ్యవసాయ అధికారి దండం విజయ్ చంద్ర

**సెప్టెంబర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) చేసుకోవాలని షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర కోరారు. పీఎం కిసాన్, పంట రుణాలు, ఎరువుల కొనుగోలు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీల లబ్ధి కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవసరమని తెలిపారు.సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఏఈఓలు లేదా మీ సేవా కేంద్రాల్లో ఆధార్, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్తో నమోదు చేసుకోవాలని సూచించారు.షాబాద్ మండలంలో 27,449 మంది రైతులకుగాను ఇప్పటివరకు 17,959 మంది (67%) నమోదు చేసుకోగా, ఇంకా 9,490 మంది నమోదు చేసుకోవాల్సి ఉందని తెలిపారు.అలాగే డిజిటల్ క్రాప్ సర్వేలో పంట వివరాలు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని కోరారు. పంట కొనుగోళ్లకు ఈ నమోదు కీలకమని, సర్వే సిబ్బంది గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి సరైన పంట వివరాలు తెలియజేయాలని విజయ చంద్ర సూచించారు.



## జూరాల ధర్నాకు వెళ్లకుండా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి హౌస్ అరెస్ట్

**జడ్చర్ల, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** జడ్చర్ల: జూరాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చేపట్టిన ధర్నా పిలుపు నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత డాక్టర్ సి. లక్ష్మారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సోమవారం ఉదయం తిరుమల హిల్స్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన జూరాల ప్రాజెక్టు వైపు వెళ్లకుండా గృహనిర్బంధంలో ఉంచారు.జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రాజెక్టు వద్ద ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని పలువురు బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకోవడంతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జూరాల ప్రాజెక్టు పరిసరాల్లో కూడా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హౌస్ అరెస్ట్ సందర్భంగా డాక్టర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడుతున్న నాయకులను అడ్డుకోవడం, అరెస్టు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ పంటలకు నీటిని విడుదల చేయడం లేదని లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఇప్పటికే పంటల సాగు కోసం రైతులు పెట్టుబడులు పెట్టారని, సాగునీరు అందక పంటలు దెబ్బతింటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, జూరాల



ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ నాయకులు, రైతులు ప్రాజెక్టు వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పలుచోట్ల నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. జూరాల ప్రాజెక్టు వద్ద కూడా పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని పర్యవేక్షించారు.సాగునీటి సమస్యపై రైతుల తరపున ఆందోళన కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ముందస్తు చర్యలు చేపట్టినట్లు పోలీసుల చర్యల నేపథ్యంలో వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి.

## మార్కెట్ డైరెక్టర్ నేలపాటి రామారావు జన్మదిన వేడుకలు



**వనస్థలిపురం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** హైదరాబాద్ మార్కెట్ డైరెక్టర్ నేలపాటి రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా జరిగాయి పలువురు అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావుకు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినారు. సుమారుగా 2000 మంది అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి బోర్డు మెంబర్ ఈశ్వరమ్మ యాదవ్, శ్రీనాథ్ కొల్లూరి వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు అయిత గొని శ్రీనివాస్ బి.ఎన్.రెడ్డి డివిజన్ అధ్యక్షులు గణేష్ రెడ్డి, వేములయ్య గౌడ్, సురేష్ యాదవ్, చెరుకు భవాని గౌడ్, శ్రీకాంత్, పలువురు మార్కెట్ ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎర్రాయి గూడెం గ్రామంలో గణనాథున సన్నిధిలో ఘనంగా అన్నదాన కార్యక్రమం





**ఇల్లందు, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** టేకులపల్లి మండలం ఎర్రాయిగూడెం గ్రామపంచాయతీ ఎర్రాయిగూడెం గ్రామంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో గణనాథునికి ఘనంగా పూజలు నిర్వహించారు దేవుడే ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని కి పూజలు నిర్వహించారు సకాలంలో వర్షాలు బాగా పడి పంటలు పండాలని వేడుకున్నారు వేడుకున్నారు అనంతరం ఈరోజు గణనాథుని సన్నిధిలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ ఊకె.రమేష్ వార్డ్ మెంబర్లు గ్రామ మహిళలు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు

## మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష

**పెద్దపల్లి, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్‌ను సోమవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు.సెప్టెంబర్ 23న స్థానిక ఆయుష్ వింగ్స్ హాస్పిటల్, జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలో జరిగే ఈ మెగా హెల్త్ ఆయుర్వేద క్యాంప్‌ను పెద్దపల్లి జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ జి.ఎన్. అరుణ, ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి. శోభారాణి, వైద్యాధికారులు డాక్టర్ కె. అమర్‌నాథ్, డాక్టర్ వి.మారుతి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్. విద్యాసాగర్,తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో మున్సిపల్ ఉద్యోగులు




**నిజామాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** సోమవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు.ఓ విశ్రాంత ఉద్యోగి పెన్షన్ మంజూరు కోసం అవసరమైన సర్వీస్ బుక్ ఎంట్రీలు,ఇంక్రిమెంట్ ప్రొసీడింగ్స్ సిద్ధం చేయడానికి రూ.35 వేల లంచం డిమాండ్.రూ.15 వేలు అందజేయు సమయంలో జూనియర్ అసిస్టెంట్ అశోక్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కిరణ్ లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.బాధితుల ఫిర్యాదుతో ఏసీబీ ఈ చర్య తీసుకుంది. అధికారులు పట్టుకున్నారు.నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసి అనిశా కోర్టులో హాజరుపరుస్తామని ఇన్ ఛార్జ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే నిర్భయంగా ఏసీబీని సంప్రదించాలని నిజామాబాద్ ఇన్ ఛార్జ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు.

## ప్రేమావతిపేట శ్మశాన వాటికలో నూతన నీటి తొట్టి ఘనంగా ప్రారంభం



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ మండలం ప్రేమావతిపేట శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన నీటి తొట్టి ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. విట్టలేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో స్థానికుల విరాళాలతో ఈ తొట్టిని నిర్మించారు. గత కొంతకాలంగా వాటికలో నీటి కొరత ఉండటంతో అంత్యక్రియలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను గుర్తించి సంఘం సభ్యులు ముందుకు వచ్చి నీటి తొట్టి నిర్మాణాన్ని చేపట్టారని నిర్వాహకులు తెలిపారు. దాతలు, సభ్యులు అందించిన ఆర్థిక సహాయంతో పనులు వేగంగా పూర్తి చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విట్టలేశ్వర రజక సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, వాటిక అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వాటికలో మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని, అందరి సహకారం అవసరమని కోరారు.

## సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో యువత పాత్ర కీలకం: పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా కాటేదాన్, మైలార్ దేవులపల్లి డివిజన్ల పరిధిలోని పలు గణేష్ మండపాలను ఆయన సందర్శించారు. గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలను భక్తి, ఐక్యత, సేవాభావంతో ఘనంగా నిర్వహిస్తున్న వెల్ఫేర్ సంఘాలు, యువజన సంఘాల నిర్వాహకులను అభినందించారు. సుడిగాలి పర్యటనలో భాగంగా డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, గుమ్మడి కుమార్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలపై సుమారు 78 వినాయక మండపాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, రమేష్ ముదిరాజ్, రాము యాదవ్, మైసిరెడ్డి, రఘు యాదవ్, రాజేష్ యాదవ్, కొంపల్లి జగదీష్, నాయకులు అనిల్, వెంకటరమణ, రామకృష్ణ, కార్తీక్, నాని, శశికుమార్, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీగూడలో గణనాథునికి ప్రత్యేక పూజలు



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** లక్ష్మీగూడ బస్తీలో జాంబవంతుల యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుని మైలార్ దేవులపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీ ప్రేమ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనంజయ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సారికొండ వెంకటేష్, లక్ష్మారెడ్డి, ఆదికే లావణ్య, గటయ్య, పవన్, విజయ్, కమిటీ సభ్యులు కె జగ్గు, డి గిరి బాబు, డీ సికిందర్, డి హరిబాబు, ఎస్ చింటూ, ఎస్ శ్రీకృష్ణ, ఎన్ సందీప్, ఏన్ సాయి తదితరులు పాల్గొన్నారు

## గణేష్ శోభయాత్ర కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు : పోలీస్ కమిషనర్ వెల్లడి

- శోభయాత్రలో 1300 మంది సిబ్బందితో భారీ ఏర్పాట్లు
- శోభయాత్ర దారి పొడవున పటిష్టమైన నిఘా వ్యవస్థ
- డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ,200 సి.సి కెమెరాలతో ఏర్పాట్లు




**నిజామాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్,ఆర్మూర్,బోధన్ డివిజన్ లలోని అన్ని గణేష్ నిమజ్జనోత్సం శోభయాత్ర సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలియజేయడం జరిగింది.గణేష్ నిమజ్జనోత్సవ శోభయాత్ర శాంతియుతంగా సజావుగా నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని,అన్ని డివిజన్ పరిధిలలో ప్రధాన నిమజ్జన మార్గాల్లో దాదాపు 1300 మందికి పైగా పోలీస్ సిబ్బందిని నియమించామని,సి.సి కెమెరాల ద్వారా నిఘా డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ,ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాట్లు,పోలీస్ సిబ్బందితో పాటు ఎక్సైజ్ శాఖ,ఫారెస్టు శాఖ,ఎన్.సి.సి,ఎన్.ఎస్.ఎస్ మొదలగు వారితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.శోభయాత్రలో తప్పనిసరి పాటించవలసిన సూచనలు1) నిమజ్జన ఊరేగింపులో శాంతియుతంగా పాల్గొనాలని2) అనుమానస్పద వ్యక్తులు,వస్తువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి3) ట్రాఫిక్ నియమాలు అందరూ పాటించాలని4) ఆడియో సిస్టమ్స్ నిర్ణీత స్థాయిలో ఉపయోగించాలని5) డి.జేలు పూర్తిగా నిషేదం6) ఎటువంటి "రూమర్స్" (పుకార్ల)ను నమ్మరాదు.7) మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనడం తప్పు వారిపై కఠిన చర్యలు తీసుకోబడును. అత్యవసర సమయంలో సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :1) 112 డయల్2) పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 87126-597003) సంబంధిత పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించగలరు.ప్రజలందరూ ఈ గణేష్ శోభయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలియజేశారు.

## గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు

- రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి



**గగన్ పహాడ్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**

గగన్‌పహాడ్:రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గగన్‌పహాడ్‌లోని శివ గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని కార్తిక్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం తిరుపతిరెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి, శీలం తిరుపతిరెడ్డి,ఎర్రోళ్ల యాదయ్య, గుమ్మడి కుమార్, నోముల రాము యాదవ్, పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి, వల్లూరి నాగేష్,సూరెడ్డి సాయికృష్ణారెడ్డి, సంతోష్ రెడ్డితో పాటు భక్తులు మరి గ్రామ పెద్దలు, వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిది : శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** అనారోగ్యానికి గురై చికిత్స కోసం అప్పుల పాలవుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం వరం లాంటిదని రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండలం వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన బుడాల నరసింహ ముదిరాజ్ అనారోగ్యంతో చికిత్స పొందారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా 60 వేల రూపాయలు మంజూరయ్యాయి. సోమవారం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారునికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, పేద ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని, వైద్య ఖర్చులతో ఇబ్బంది పడే వారిని ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ పథకాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కుమ్మరి శేఖర్, బుడాల అరుణ్ ముదిరాజ్, బుడాల దర్శన్ ముదిరాజ్, కొండే సాయికిరణ్ యాదవ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా... విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు. వీరిద్దరి అరెస్టును, రిమాండ్‌ను అడ్డుకుంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరిశీలించిన హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీల కౌంటర్ దాఖలుకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.



# మియాపూర్‌లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న వినాయక చవితి ఉత్సవాలు



**మియాపూర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ** : ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వాతావరణం, యువత ఉత్సాహం, ప్రజల భాగస్వామ్యంతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్,యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.మియాపూర్ విలేజ్, మియాపూర్ మీ–సేవా, వడ్డెర బస్తీ, రాచమల్ల కృష్ణ పటేల్ నివాస ప్రాంతం, మియాపూర్ యువశక్తి, వడ్డెర యువజన సంఘం, టి. ఎన్ నగర్, అవిగ్నా యూత్ అసోసియేషన్, సాయిరామ్ నగర్, ఎఫ్ సీ ఐ కాలనీ, ఆర్ బి ఆర్ కాంప్లెక్స్, ఆర్ బి ఆర్ ఉత్సవ కమిటీ, ప్రజయ్ షెల్టర్స్, ఎం.ఎ నగర్ , ప్రగతి ఎన్‌క్లేవ్, వినాయక యువజన సంఘం, జనప్రియ వెస్ట్ సిటీ, నైలా గేటెడ్ కమ్యూనిటీ, హెచ్ ఎం టి, కృష్ణ సాయి అపార్ట్‌మెంట్, స్టాలిన్ నగర్,ఉత్సవ్ అసోసియేషన్, మదీనాగూడ హుడా కాలనీ, ఎ బి యూత్ అసోసియేషన్, శ్రీరంగాపురం కాలనీ, అరోబిందో కాలనీ, ఎస్ ఆర్ ఎస్టేట్స్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన సందర్శించారు.ఆయా ప్రాంతాల్లో గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, పలుచోట్ల నిర్వాహకులు, యువత , స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కొన్ని ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని యలమంచి ఉదయ్ కిరణ్ సూచించారు. సంప్రదాయాలను కాపాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ భక్తి, సేవ, ఐక్యతతో ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ , స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మియాపూర్ శివాలయంలో విఘ్న వినాయక స్వామి పూజలు..పాల్గొన్న ప్రముఖులు



**మియాపూర్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ** : మియాపూర్ యూత్ అసోసియేషన్ హనుమాన్ దేవాలయం ఆదివారం సాయంత్రం గణేష్ పూజలో పాల్గొన్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ .ఈ కార్యక్రమం లో రాచమల్ల కృష్ణ గౌడ్, వీరమల్ల వీరేంద్ర గౌడ్,నల్ల సంజీవ్ రెడ్డి, కూన రామకృష్ణ గౌడ్, తాండ్ర రాంచందర్ గౌడ్, బండారు మహేందర్ ముధిరాజ్, మన్నె సురేష్ ముధిరాజ్, బండారు శ్రీనివాస్ ముధిరాజ్, మన్నె విజయ్ ముధిరాజ్, మన్నె నరేందర్ ముధిరాజ్, కందికొండ శ్రీనివాస్ గౌడ్, పల్లె మురళి గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్, ముద్దంగుల తిరుపతి, మన్నేపల్లి సాంబశివరావు, శరత్, ఎల్లెంకి శ్రీనివాస్ గౌడ్ తధితరులు పాల్గొన్నారు

# రవీంద్రభారతిలో ఘనంగా 'సంగీత నృత్యోత్సవం'

## - అలరించిన సకల కళల సమ్మేళనం






**హైదరాబాద్, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం – భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'శ్రీ రాగరమ్య కల్చరల్ & సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతి మెయిన్ హాల్‌లో నిర్వహించిన "సంగీత నృత్యోత్సవం – సకల కళల సమ్మేళనం" కార్యక్రమం అత్యంత వైభవంగా, విజయవంతంగా పూర్తయింది. ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు సాగిన ఈ సాంస్కృతిక వేడుకలలో కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన కళారత్న, హాస్యబ్రహ్మ, సీనియర్ పాత్రికేయులు డా॥ శంకర నారాయణ మాట్లాడుతూ.. సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. అద్భుతమైన ప్రదర్శనలు: సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రమ్య పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవంలో ప్రముఖ గురువుల శిష్యులు తమ కళాప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.సంగీత ప్రదర్శనలు: సంగీత గురువులు కుమారి వేదుల శ్రీ అపర్ణ, శ్రీమతి చందన మనోహర్, శ్రీమతి స్వాతి అనుముగంటి, శ్రీమతి వాసంతి శర్మ శిష్యుల స్వరాలాపనలు వేదికను రంజింపజేశాయి.నృత్య రూపకాలు: నృత్య గురువులు కుమారి సాయి సుప్రజ, కుమారి కీర్తన, కుమారి విజయలక్ష్మి , శ్రీమతి వీరలక్ష్మి , శ్రీమతి శ్రీవిద్య, శ్రీమతి యమునలతో పాటు కొరియోగ్రాఫర్ శ్రీ చందు దర్శకత్వంలో ప్రదర్శించిన నృత్యాలు సభను మురిపించాయి.కార్యక్రమం ముగింపులో పాల్గొన్న గురువులను, కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వేడుకను విజయవంతం చేసిన అతిథులకు, కళాకారులకు, వీక్షకులకు మరియు సహకరించిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖకు సంస్థ అధ్యక్షురాలు రమ్య ధన్యవాదాలు తెలిపారు.

# యెల్లంకి సోదరుల సౌజన్యంతో హనుమాన్ ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం..



**మియాపూర్ , సెప్టెంబర్ 21, నేటి శుభోదయ** : మియాపూర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయంలో సోమవారం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యెల్లంకి రవీందర్ గౌడ్, యెల్లంకి శ్రీనివాస్ గౌడ్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ గ్రామ పెద్దలు, యూత్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, స్థానిక వ్యాపారవేత్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సేవా దృక్పథంతో ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు.

# స్వయం నియంత్రణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి

- **ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వుస్తాల సోమిరెడ్డి**
- **సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో మాదక ద్రవ్యాల నియంత్రణ అవగాహన సదస్సు**
- **ఆలోచింపజేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మధిర వినూత్న కార్యక్రమం**
- **మత్తు మనిషిని బానిసగా మార్చి ఉజ్వల భవిష్యత్తుకు ఆటంకమవుతుందన్న ఎక్సైజ్ సీఐ బాల కిషన్**




**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ** : విద్యార్థులు చెడు వైపుకు వెళ్ళకుండా స్వయం నియంత్రణతో తమకు తాము ఉన్నత మార్గంలో నడుచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వి సోమిరెడ్డి అన్నారు. సోమవారం మధిర కిష్టాపురం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం ,ముదిగొండ లో గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ అవగాహన సదస్సు లో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి రాములు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడమే కాకుండా తమకు నచ్చిన విదేతర కార్యక్రమాలపై దృష్టి సారించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి తమ గ్రామాలకు వెళ్లిన తరువాత తన చుట్టూ ఉండే వారిలో ఎవరైనా మత్తుకు అలవాటు పడితే వారిని సక్రమమైన మార్గంలో తీసుకువచ్చే పోలీస్ డిపార్ట్మెంట్కు సమాచారం ఇచ్చి కాపాడాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులకు బంధువులకు తమ తోటి వారికి బాదకద్రవ్యాల నివారణ పై అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలు మనిషిని సమాజంలో క్షీణత కు గురి చేస్తుందని మనిషి తన నియంత్రణ కోల్పోయి సమాజంలో చీత్కరించబడతాడు అన్నారు. ఆరోగ్యకరమైన గొప్ప సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎనలేనిది అన్నారు. అందుకే విద్యార్థి చదువుతో పాటు సమాజ నిర్మాణం పరిసరాల శుభ్రతను చక్కగా ఉండేలా చూసుకోవాలన్నారు హానిసలుగా ఉండడం మరొకరి నియంత్రణలో కాకుండా విద్యార్థులు తమకు తాముగా స్వయం నియంత్రణలో స్వయం శక్తితో ఉత్తమ పౌరులు ఎదగడానికి ప్రయత్నించాలన్నారు అవసరమైన ప్రతి సందర్భంలో ఉపాధ్యాయుల నుండి పూర్తిని పొందాలన్నారు.కార్యక్రమంలో మధిర ఎక్సైజ్ సీఐ బాలకిషన్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐనాల సైదులు,మధిర ఎక్సైజ్ సీఐ బాలకిషన్, జేవిపి సంజీవరావు, సీనియర్ అధ్యాపకులు కొక్కిరేణి సత్యం , నాగేశ్వరరావు,రామయ్య ఉపాధ్యాయులు సామ్సన్, రేణుక, రాధిక, శరత్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బూట్లు, బెల్టులు, బ్యాగుల పంపిణీ

- **వాజేడు మండలంలోని పలు పాఠశాలలకు విద్యా సామగ్రి అందజేత**




**ములుగు జిల్లా /వాజేడు, సెప్టెంబర్ 21 , నేటి శుభోదయ** : వాజేడు మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల అవసరాల కోసం బూట్లు, బెల్టులు, బ్యాగులను పంపిణీ చేశారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలకు బూట్లు, బెల్టులను, జీపీఎస్ పాఠశాలలకు బ్యాగులు, బెల్టులను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) తేజావత్ వెంకటేశ్వరరావు తన చేతుల మీదుగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సక్రమంగా అందించి, పాఠశాలల్లో వాటి వినియోగాన్ని పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నగేష్ మరణం బాధాకరం

- కుటుంబానికి రూ.67 వేలు అందజేత
- కళాకారుల ఔదార్యం



**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** స్వరమధురిమ కల్చరల్స్ దివంగత అధ్యక్షుడు ఇసనపల్లి నగేష్ ఆకస్మిక మరణం బాధాకరమని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు.ఆదివారం రాత్రి వియంయన్ కల్చరల్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు వంజా మాలతి నాయుడు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో సాయిశ్రీ డెవలపర్స్ అధినేత కమర్తపు శ్రీధర్,ఆధ్యాత్మిక గురువు డా.సెలువోజు చంద్రమౌళి,వ్యాపారవేత్త జల్లా లక్ష్మీనారాయణ,టీవీ నటులు వంజా రమేష్,స్వరమాధురి అధ్యక్షులు ఆదిరాజు పురుషోత్తమరావు,స్వరసుధ ఉపాధ్యక్షులు వీవీ రెడ్డి అతిధులుగా హాజరై సంతాప సందేశాలతో నివాళులర్పించారు.అనతి కాలంలోనే ఎత్తుకు ఎదిగి ఎంతోమంది గాయనీగాయకులను ఖమ్మానికి పరిచయం చేయడంతో పాటు వరల్డ్ రికార్డులు సాధించి పెట్టడంతో గాయకులకు గుర్తింపు లభించేలా కృషి చేసిన నగేష్ చిన్న వయసులోనే మరణించడం కళారంగానికి లోటని అన్నారు.

**రూ.67వేలు అందజేత**

మాలతినాయుడు సేకరించిన విరాళాలు 67వేల రూపాయలను నగేష్ కుటుంబ సభ్యులకు అతిధుల చేతుల మీదుగా అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.ఇకముందు కూడా నగేష్ ఇద్దరు కూతుళ్ల చదువుల కోసం చేయూతనందిస్తామని అతిధులు ప్రకటించారు.కార్యక్రమంలో గాయనీగాయకులు,కళాకారులు పాల్గొని నివాళులు సమర్పించారు.

# ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం చెరువు వద్దకు విగ్రహాలు చేరుకునేందుకు మార్గాలు

**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :**

ఖమ్మం రూరల్ మండలం నుంచి, రాపర్తి నగర్,బీసీ కాలనీ, కూరగాయల మార్కెట్, ఆర్ఆర్ స్కూల్ ఏరియా, కొత్త బస్టాండ్ ఏరియా, సాయిబాబా ఆర్చ్, ఆర్టిఏ ఆఫీస్ ఏరియా, బ్యాంక్ కాలనీ, వికలాంగుల కాలనీ, బల్లేపల్లి,ఖానాపురం టేకులపల్లి,న్యూ విజన్ కాలేజ్ పైపు నుండి వచ్చే గణేష్ విగ్రహాలు బైపాస్ ద్వారా ఎన్టీఆర్ సర్కిల్ కి చేరుకొని, అక్కడి నుండి ఇల్లందు ఎక్స్ రోడ్, గవర్నమెంట్ హాస్పిటల్ జడ్పీ సెంటర్,చెరువు బజార్ బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, ముస్తాఫ్ నగర్ సంబానినగర్, రాఘవ మెడికల్స్, శ్రీరామ్ హిల్స్, ధంసలాపురం చెరువుకి వెళ్లేదారి గుండా నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి.పంపింగ్ వెల్ రోడ్, గాంధీనగర్, మోతీనగర్, పిఎస్ఆర్ రోడ్, గాంధీచౌక్ సారధినగర్, బొక్కలగడ్డ నుండి వచ్చే వాహనాలు నయాబజార్ నుండి జూబ్లీ క్లబ్ మయూరి సెంటర్, మామిళ్లగూడెం, బురాన్ పురం, బస్ డిపో ఏరియా, కమాన్ బజార్, కస్బా బజార్ నుండి వచ్చే వాహనాలు కిన్నెరసెంటర్, జడ్పీ సెంటర్, చెరువు బజార్ , చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి. శ్రీ శ్రీ సర్కిల్, శ్రీ నగర్ కాలనీ, రోటరీ నగర్, ఇందిరానగర్, పాత మమతా మెడికల్ కాలేజీ, మమత ఎక్స్ రోడ్, కవి రాజు నగర్, పాత కలెక్టరేట్ బ్యాక్ గల విగ్రహాలు గట్టయ్య సెంటర్, బ్యాంక్ కాలని,వీడియోస్ కాలనీ నుండి వచ్చే వాహనాలు ఇల్లందు ఎక్స్ రోడ్డు నుండి జడ్పీ కి చేరుకొని చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి. వెంకటగిరి ఎక్స్ రోడ్, శ్రీనివాస నగర్, గ్రేయిన్ మార్కెట్ ఏరియా, ప్రకాష్ నగర్, గుట్టల బజార్, జహీర్ పుర తండా, అయ్యప్ప స్వామి టెంపుల్ ఏరియా విగ్రహాలు మొత్తం మెయిన్ రోడ్డు ద్వారా చర్చి కాంపౌండ్ కి చేరుకొని అక్కడి నుండి నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి. గొల్లగూడెం మధురానగర్ రాఘవయ్య నగర్ మమతా కాలేజ్, హార్వెస్ట్ స్కూల్ ఏరియా, అల్లిపురం, కొత్తగూడెం, అల్లిపురం ఎక్స్ రోడ్డు నుండి వచ్చే విగ్రహాలు టాటా మోటార్స్ ద్వారా చెరువు బజార్, చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, మిషన్ హాస్పిటల్ ఏరియా, ముస్తఫా నగర్, సంబాని నగర్, పరికముక్కల కాలనీ, శ్రీరామ్ నగర్, శ్రీరామ్ హిల్స్ నుండి వచ్చే విగ్రహాలు మెయిన్ రోడ్డు ఎక్కి నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.




**తిరుగు ప్రయాణం**

నిమజ్జనం అనంతరం ప్రజలు, వాహనాలు నిమజ్జనం పాయింట్ నుండి జయశంకర్ విగ్రహం వరకు చేరుకొని ప్రకాష్ నగర్, శ్రీనివాస్ నగర్, జహీర్ పుర తండా, అయ్యప్ప టెంపుల్, వెంకటగిరి ఎక్స్ రోడ్ వైపు వెళ్లేవారు ధంసలాపురం బ్రిడ్జిని దాటి బ్రిడ్జి కింది నుండి ధంసలాపురం ఊర్లో నుండి ఎస్వీఎం స్కూల్ మీదుగా శ్రీనివాస నగర్, అయ్యప్ప టెంపుల్, ప్రకాష్ నగర్ వైపు వెళ్లి మెయిన్ రోడ్డు ద్వారా వారి గమ్యస్థానాలకు వెళ్ళవచ్చు.ముస్తఫా నగర్, మమతా రోడ్, ఇల్లందు ఎక్స్ రోడ్, ఎన్టీఆర్, బల్లేపల్లి మామిళ్లగూడెం, న్యూ బస్టాండ్ రాపర్తి నగర్, రూరల్ పైపు వెళ్లేవారు జయశంకర్ విగ్రహం దగ్గర నుండి శ్రీరామ్ హిల్స్, రాఘవ మెడికల్స్ దగ్గర రోడ్ క్రాస్ చేసి పరికముక్కల కాలనీ ద్వారా అల్లిపురం ఎక్స్ రోడ్డుకు చేరుకొని అక్కడి నుండి టాటామోటార్స్, లకారం, మమత ఎక్స్ రోడ్డుకు చేరుకొని ఇందిరానగర్, శ్రీశ్రీ ద్వారా బైపాస్ కు చేరుకొని వారి గమ్యస్థానాలకు వెళ్ళవచ్చు. వినాయక నిమజ్జనం అనంతరం బయటకు వెళ్లే దారులను కేవలం వన్ వే ట్రాఫిక్ మాత్రమే అనుమతిస్తామని, ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# యుద్ధాలతో శాంతి కపోతం రక్తసిక్తం

- విజ్ఞాన్ లో ప్రపంచ శాంతి దినోత్సవం

**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ప్రపంచవ్యాప్తంగా నేడు అశాంతి మేఘాలు కమ్ముకున్నాయని, రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్ -పాలస్తీనా, అమెరికా - ఇరాన్ ల మధ్య సాగుతున్న యుద్ధాల కారణంగా వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతుండగా, లక్షలాది మంది శరణార్థులుగా తయారవుతున్నారని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్యనారాయణ పేర్కొన్నారు. విజ్ఞాన్ విద్యాలయం లో సోమవారం నిర్వహించిన 'ప్రపంచ శాంతి దినోత్సవ' ప్రత్యేక సదస్సులో ఆయన ఉపన్యసిస్తూ యుద్ధాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడమే కాకుండా, మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని, దీనితో ఆధునిక సమాజం తిరిగి ఆటవిక యుగలక్షణాలతో తిరోగమిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రపంచవ్యాప్తంగా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడానికి ఐక్యరాజ్యసమితి 1981లో ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి ఏటా సెప్టెంబర్ 21న 'అంతర్జాతీయ శాంతి దినోత్సవం' జరుపుకుంటున్నామని తెలుపుతూ యుద్ధాలు కేవలం విధ్వంసానికి, పేదరికానికి, నిరుద్యోగానికి దారితీస్తాయని, ఆయుధాల పోటీని విడిచిపెట్టి, వాతావరణ మార్పులు, పేదరికం, ఆకలి చావుల వంటి నిజమైన సవాళ్లపై ప్రపంచ దేశాలు పోరాడాలని అన్నారు. విద్య, వైద్యం, మానవ హక్కుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత అంశాలుగా గుర్తించాలని, పరస్పర గౌరవం,సఖ్యత, స్నేహం, విశ్వమానవ సౌభ్రాతుత్వభావనతో కూడిన జీవన విధానమే ప్రపంచప్రగతికి మూలాధారమని, దీనికై ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకుని ప్రపంచశాంతి దిశగా వేగంగా అడుగులు వేయాలని పేర్కొంటూ 'కంటికి కన్ను అనే సిద్ధాంతాన్ని నమ్ముకుంటే చివరికి అందరూ గుడ్డివారిగా మిగిలిపోతారన్న' మహాత్మా గాంధీ మాటలు ఆధునికజీవన విధాన సూచికలని సూర్యనారాయణ పేర్కొన్నారు.

# సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

- ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలి : డీపీఓకు సర్పంచుల సంఘం వినతి

**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :**

సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సర్పంచుల సంఘం ప్రతినిధులు ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జి. వినోద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్పంచుల సంఘం అధ్యక్షులు అబ్బూరి నరహరి, ప్రధాన కార్యదర్శి బానోత్ బిక్షం నాయక్ ఆధ్వర్యంలో ప్రతినిధులు డీపీఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచులకు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న నెలవారీ గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా డ్వాక్రా సంఘాల సమావేశాలకు సంబంధించిన ఆహ్వానం, ఇతర అంశాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వివరించారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సర్పంచులు కీలకపాత్ర పోషిస్తున్నారని, అయితే పలు సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం ప్రతినిధులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సర్పంచుల సమస్యలను డీపీఓ పి. వినోద్ సానుకూలంగా విన్నారని, సమస్యల



పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచుల సంఘం ప్రతినిధులు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# గుడిసెలో నుండి మెడికల్ కాలేజీకి

- మట్టి లో మాణిక్యం ఎంబిబిఎస్ సీటు సాధించిన సాయి వరుణ్



**ఖమ్మం, తిరుమలయపాలెం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** పేదరకం లో పుట్టి చిన్న వయస్సు లోనే తండ్రినీ కోల్పోయిన (బుడిగెం శ్రీలత వెంకటేశ్వర్లుల కుమారుడు) బుడిగెం సాయి వరుణ్ వెనకడుగు వేయకుండా అమ్మమ్మ అల్లి యశోద దగ్గర ఉంటూ బాల్య విద్యాభ్యాసం రఘునాథపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదివి అనంతరం ఏన్కూర్ గురుకులంలో సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసి 2025- 2026 ఎంసెట్ లో 2088 ర్యాంక్ తో వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎం బిబిఎస్ లో సీటు సాధించారు. విషయం తెలుసుకున్న జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ సాయి వరుణ్ నీ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగ్విజయంగా ఎంబీబీఎస్ పూర్తి చేసి నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. గ్రామ పెద్దలు గౌని మల్లయ్య,తక్కెళ్ళపల్లి నరేందర్ రావు, య ద్రబోయిన వెంకన్న, కోండ్రు మహేష్ సాయి వరుణ్ ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# గణనాథుడే ప్రకృతి స్వరూపం

- మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లి బాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు

**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని కొత్త కాలనీ సెంటర్ లో మహా అన్నదాన కార్యక్రమాన్ని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు ప్రారంభించారు. అంతకుముందు గణనాథుని వద్ద పూజలు చేశారు. మహా అన్నదాన దాత ఉస్మాన్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు షేక్ రబ్బానీ పాషా- మీరాభి, గణపతి నవరాత్రి ఉత్సవాలను పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను మల్లిబాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు, సర్పంచ్ ధరావత్ అనురాధ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు అభినందించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ గణపతి అంటేనే ప్రకృతి స్వరూపమని, ప్రత్యేక పూలు కావాలని పూజ చేయాలని లాంటి నియమాలు లేవని మనకు కనిపించే ప్రతి చెట్ల ఆకులతోనూ మొక్కలతోనూ, గణపతిని పూజించవచ్చని, అందుకే మట్టితో తయారైన గణనాథుడు నవరాత్రుల తర్వాత మళ్లీ గంగమ్మ ఒడిలోకి వెళ్లడం అంతేకాకుండా బుద్ధిలో వినయంలో గణనాథుని మించిన దేవతలు లేరని పురాణాలు చెబుతున్నాయి. మహా శరీరంతో ఉన్నప్పటికీ, వినయ విధేయతలతో తన తల్లిదండ్రులను మెప్పించి దేవతల అందరికంటే ముందు పూజలు అందుకుంటున్నాడు. అందరకు అగ్రగామిగా నిలిచాడు. గణనాథుని సేవించడం వలన సర్వ విఘ్నాలు తొలగిపోతాయని శాస్త్రాలు చెబుతున్నాయని మల్లి బాబు యాదవ్ తెలిపారు. గణపతి సేవలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ఆ వినాయకుని ఆశీర్వాదాలు ఎల్లప్పటికీ ఉండాలని, గణనాథుని ఆశీర్వాదం వలన గ్రామాలు పల్లెలు, ప్రతి కుటుంబం పచ్చగా, పచ్చని పైరులతో పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటున్నట్లు, అదేవిధంగా ఇల్లందు ఎమ్మెల్యే అన్న కోరం కనకయ్య ఆశీస్సులతో గ్రామంలో అర్హులైన ప్రతి





ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేటట్లు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వారు మెంబర్లు మీరాబి, చంద్రు, కొమ్మినేని పుల్లయ్య మొగిలి శ్రీను ఉప్పుగంట వీరభద్రరావు, శీలం పుల్లయ్య డేరంగుల తిరుపయ్య, పాటిబండ్ల ప్రసాదు భూక్యా నాగేంద్రబాబు తురక బిక్షం రాయల నాగ శంకర్, మంజుల వెంకన్న, చల్ల మల్లయ్య బానోతు లక్ష్మ,బాదావత్ నాగరాజు, మరియు భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్




**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు ఏ దశలో కొనసాగుతున్నాయి, ఇప్పటివరకు ఎంత మేరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, సంబంధిత ఏర్పాట్లపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.అదే విధంగా వెలుగుమట్లలో నిర్మించనున్న దవాఖాన, కమ్యూనిటీ హాల్, పార్క్, అంగన్‌వాడీ కేంద్రం, షాపింగ్ కాంప్లెక్స్ తదితర మౌలిక వసతుల కోసం కేటాయించిన ప్రదేశాలను కూడా కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శ్రీనివాసులు, కేఎంసీ ఈఈ మురళి, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం వీధుల్లో కిసాన్ సభల కళా ప్రదర్శనలు

- ఆసక్తికరంగా అరుణోదయ ప్రచారం




**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఈనెల 28,29, 30తేదీల్లో జరగనున్న అఖిల భారత కిసాన్ సభల ప్రచారంలో భాగంగా అరుణోదయ కళాకారులు ఖమ్మం లోని వీది వీదినా వారంరోజులుగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ఈనెల 28న యస్ఆర్ అండ్ బిజీయన్ఆర్ కళాశాల గ్రౌండ్ లో జరిగే భారీ బహిరంగ సభ గురించి, తెలంగాణాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 60మంది కళాకారులు మూడు జట్లుగా ఏర్పడి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, రైతు–కూలీ మహాసభల ప్రాదాన్యత పైన విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మూడు కళా బృందాల ప్రచారం పట్టణంలో హోరెత్తుతుంది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కు చెందిన సూర్యాపేట ఉదయగిరి బృందం గొంగళ్ళు ధరించి రైతు–కూలీల సమస్యలను తెలంగాణా యాసలో మాట,పాటలుగా మలిచి,కూర్పుచేసుకొని ప్రదర్శనలిస్తున్నారు ."రండన్నా పోదాం మనం–రైతుకూలీ సభలకు"అంటూ పాట,అంటే,మాట ద్వారా ఆకట్టుకుంటున్నారు. నాటు వేసే దగ్గరనుండి మొక్కపెంచి ,పంట అమ్ముకునే వరకు ఎదురయ్యే సమస్యలు ఏకరువు పెట్టి ఆసక్తికరమైన ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇక మరో అరుణోదయ డప్పు కళాకారులు బృందం కొత్తగూడెం కు చెందిన చిరంజీవి నేతృత్వంలో సామూహిక డప్పు నృత్యాలు చేస్తూ పట్టణంలోని శ్రామిక వాడల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.లయబద్ధంగా వేస్తున్న డప్పు బృందం అడుగుల ద్వారా ప్రజలను ఆకట్టుకొంటున్నారు. మంచిర్యాల జిల్లా కు చెందిన అరుణోదయ బృందం అందెమంగ నేతృత్వంలో రైతు–కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వీది నాటికలు వీది వీదినా ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో పరిస్థితి, తద్వారా బోర్లు ఎండిపోవడం,పంటలు ఎండిపోవడం , వర్షాలు కురవక పోవడం,ధరలు పెరగడం,లాంటి కరువు పరిస్థితి కళ్ళకు కట్టేలా స్క్రిప్ట్ తయారు చేసుకొని వీధి వీధినా వీది నాటికలు అనబడే అదృశ్యరూపాలతో ఆకట్టు కుంటున్నారు. జాతీయ మహాసభలు ప్రాదాన్యత రిత్యా , సభల సమయం దగ్గర పడుతున్న కొద్ది అరుణోదయ సాంస్కృతిక సంస్థ తన ప్రచారం ముమ్మరం చేయడంతో పాటు,ఇతర రాష్ట్రాల కళా బృందాల ను సైతం ప్రచారం లో పాల్గొనేలా వ్యూహరచన చేస్తున్నారు.ముఖ్యంగా రైతులు పరిస్థితి "అమ్మబోతే అడవి–కొనబోతే కొరివి"లాగా ఉన్న స్థితి నుంచీ,ఎరువుల కొరత, రైతాంగ దోపిడీకి గురయ్యే పద్ధతులనుకళాకారులు విడమర్చి చెబుతున్నారు. అరుణోదయ కళాకారులు ఖమ్మం పట్టణంలో నే కాకుండా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో అరుణోదయ కళాకారులు ,రైతు–కూలీ సమస్యలపైన విస్తృత ప్రచారం చేస్తున్నారు. అఖిలబారత రైతు మహాసభలులు కనుక తెలంగాణా వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరుగుతోందని అరుణోదయ సాంస్కృతిక సంస్థ తెలిపింది. ఈ కళా బృందాల వెంట ప్రచారంలో సిపిఐ యంయల్ న్యూడెమోక్రసీ నాయకులు, రైతుకూలీ సంఘం నాయకులు ,పిడియస్యు,పిఓడబ్లు మహిళా సంఘాలు పాల్గొని పసభలను జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నారు. ఏఐకేయంయస్ సభల్లో వివిధ రాష్ట్రాల కు సంభందించిన కళాకారులు బృందాలు హిందీ,పంజాబీ,బెంగాలీ,తమిళం,కన్నడం,ఒరియా తదితర దేశీయ భాషల్లో కళారూపాలు ప్రదర్శనకు సన్నద్దం అవుతున్నారు. ఖమ్మం పట్టణంలో కిసాన్ మహాసభలు ప్రచారం ఊపందుకుంది.దానిలో అరుణోదయ సాంస్కృతిక సంస్థ సోషల్ మీడియా లో రూపొందించిన లఘు చిత్రాలు,కళాకారులు కళా ప్రదర్శనలు ఆకట్టు కొంటున్నాయి.

# అంతా సుభిక్షంగా ఉండాలి

- శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి
- నేడు మహా అన్నదాన కార్యక్రమం



**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ప్రజలంతా ఆయురారోగ్యాలతో, ఆనందంగా సుభిక్షంగా ఉండాలని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి ఆకాంక్షించారు. నేడు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తునామన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలోని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ప్రధాన కార్యాలయంలో, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ గణపతి స్వామి విగ్రహం వద్ద సోమవారం పూజలు, కోలాట బృదంచే కోలాట కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తొలిసారి గణేష్ విగ్రహాన్ని తమ కార్యాలయంలో నెలకొల్పి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే కుంకుమార్చన, సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించడం జరిగిందాన్నారు. ఎల్ ని నో ప్రభావంతో దేశం, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడక రైతులలో, ప్రజలలో తీవ్ర ఇబ్బంది నెలకొందని పేర్కొన్నారు. వ్యవసాయం గాడినపడి పాడిపంటలతో రైతుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. వ్యవసాయ రంగం మంచిగా ఉంటే అన్ని రంగాలు పరిడమిల్లుతాయని తద్వారా అందరూ ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తారాన్నారు. అందరి జీవితాలలోని విఘ్నాలు తొలగిపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ పార్ట్నర్ రేణుక రవి, కార్యాలయపు ఇన్చార్జ్ పోగుల రవికుమార్, ఉత్సవ కమిటీ బాధ్యులు శ్రీనివాసరాజు,సాయికిరణ్, కృష్ణ చౌదరి, వి నరేష్, సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్లు షేక్ తాజుద్దీన్, కాసాని శ్రీశైలం, గాలి నారాయణ, తోట వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ డైరెక్టర్లు, మార్కెటింగ్ సిబ్బంది కార్యాలయపు సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాలొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

# ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా బూర మనోజ్



**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎదులాపురం మున్సిపాలిటీ ముత్తగూడెం గ్రామానికి చెందిన బూర మనోజ్ ఎన్నికయ్యారు. ఈనెల 19వ తేదీన ఖమ్మం పట్టణంలో జరిగిన 27వ జిల్లా మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నాపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు ఇచ్చినందుకు పార్టీ నాయకత్వాన్ని కి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పైన రాజీలేని పోరాటాలు నిర్వహిస్తాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థిలోకమంతా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. విద్య కాషాయకరణకు ప్రైవేటీకరణకు కార్పొరేట్కరణకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. నూతన విద్యా విధానం రద్దుకై పోరాటం చేస్తాం. విద్యారంగ సమస్యల పైన రాజీలేని పోరాటం నిర్వహించడానికి సిద్ధం. ఈ అవకాశం కల్పించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు

# రోటరి క్లబ్ దివ్యాంగుల జీవితల్లో వెలుగులు నింపుతుంది

- 39 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మదూరి ప్రసాద్



**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని స్థానిక 39వ డివిజన్ లో శుక్రవార పేట గణేష్ ఉత్సవ కమిటీ 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కమిటీ వాళ్లంతా కలిసి రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో, ఖమ్మం రోటరీ సర్వీసెస్ ట్రస్ట్ వారి సహకారంతో, దివ్యాంగుల జీవితల్లో వెలుగులు నింపడానికి ముందుకొచ్చిన ఎన్నారై అసోసియేషన్ ద్వారా భయానా బాబు , కటకం రాము, తరపున దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక మాజీ కార్పొరేటర్ మదూరి ప్రసాద్ పాల్గొని 25 మంది వికలాంగులకు ఉచితంగా కృత్రిమ కాలు (జైపూర్ లెగ్స్) పంపిణీ చేశారు.అదేవిధంగా ఎన్నారై లు కూడా భయానా బాబు , కటకం రాము, కలిసి దివ్యాంగులకు 25 మంది కి జైపూర్ లెగ్స్ కృత్రిమ కాలును, 8 మందికి వీల్ చైర్స్, మిగతా 10మందికి ట్రై సైకిల్ లను అందజేసి ఆశీర్వచనాలు తెలిపారు. ఈ సందర్భంగా మదూరి ప్రసాద్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ వారు చేస్తున్న సేవ దివ్యాంగుల జీవితల్లో వెలుగులను తీసుకొని వస్తుందన్నారు. రోటరీ క్లబ్ ట్రస్ట్ వారు ఇలాంటి మంచి సేవ కార్యక్రమలు చేయడం మాకు ఎంతో సంతోషంగా ఉంది అని తెలిపారు.

# బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మోటార్ కు మరమ్మతు



**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ చేరుకుపల్లి బాలు సోమవారంరిపేర్ లో ఉన్న మోటార్ కు మరమ్మతు చేసి అందుబాటిలోకి తేవడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్ చిన్న మున్నేరు వైకుంఠ దామంలో గత రెండు నెలలుగా నీళ్ల మోటార్ రిపేర్ లో ఉన్నది.దింతో వైకుంఠ దామంకు అంత్యక్రియలు నిమిత్తం వచ్చే ప్రజానీకానికి నీటి సౌకర్యం అందుటులో లేక పోవడంతో, పక్కనే ఉన్న మున్నేరు లోకి దిగి మురికి నీరు ను వాడుతున్నారు.అంత్యయక్రియలకు వచ్చే ప్రజానీకం కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకునేందుకు, బంధుగణం స్నానం చేసేందుకు ట్యంక్ లో నీళ్లు లేక కటకటా ఏర్పడింది. మోటర్ మరమ్మతు సమస్యను ఎన్నిసార్లు సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులకు తెలియజేసిన ఫలితం లేకుండా పోయింది.దింతో బాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్పందించి తన సొంత ఖర్చులు వెచ్చించి వైకుంఠ దామంలో ఉన్న మోటార్ కు ట్రస్ట్ సభ్యుల సహకారంతో మరమ్మతు చేయించి నీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.వైకుంఠ దామంలో సోమవారం నుంచి యథావిధిగా నీటి సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు.మోటారు మర్మతుకు కృషి చేసిన వారిలో స్థానిక పార్టీల లీడర్లు కొప్పుల నరసింహారావు,క్యాబ శ్రీను,రఘు,గజ్జల వెంకన్న,పత్తిపాక శ్రీను, కొప్పెర ఉపేందర్,గుండెపోగు చిరంజీవి,ట్రస్ట్ సభ్యులు చెరుకుపల్లి ప్రవలిక,పి.వేణు,కె.సైదులు,గురవయ్య,కె.కాశయ్య,గట్టికొండ చుకయ్య తదితరులు ఉన్నారు.

# పండుగలు సామరస్యానికి ప్రతీకలు

- ఐక్యతతోనే సమాజ పురోగతి సాధ్యం
- ఆధ్యాత్మిక భావన సన్మార్గం చూపుతుంది
- యువతలో సామాజిక చైతన్యం అభినందనీయం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** పండుగలు సమాజంలో సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకలుగా నిలుస్తాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం, రామాటాకీస్ ఏరియా, పాతకొత్తగూడెం, బూడిదగడ్డ తదితర ప్రాంతాలలో వివిధ ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తో కలిసి ఆయన సందర్శించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కుల మతాల అంతరాలు లేకుండా అందరూ కలిసి జరుపుకునే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు పరోపకార గుణాన్ని, పేదలకు సాయపడే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యావంతులై సామాజిక చైతన్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గంలోని ప్రతీ సమస్య పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మండపాల నిర్వాహకులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, మునిగడప వెంకటేశ్వర్లు, బండి నర్సింహా, విసంశెట్టి విశ్వేశ్వరరావు, సునీత, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, సాంబిరెడ్డి, మల్లేష్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మహా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజ

- వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఖమ్మం జిల్లా యువ నాయకుడు తుమ్మల యుగంధర్





**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ వెంకటేశ్వర నగర్‌లో శ్రీ మహా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా యువ నాయకుడు తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీ వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులతో కలిసి కుంకుమ పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ప్రజలందరికీ శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు లభించాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.కుంకుమ పూజలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాలొనగా, పూజలో పాల్గొన్న ప్రతి భక్తురాలికి ప్రత్యేక బహుమతిని అందజేశారు. దీంతో మహిళా భక్తుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.ఈ కుంకుమ పూజ కార్యక్రమానికి దాతలు అల్లే సాయి కిరణ్ – రుపాదేవి దంపతులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లు కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, నాళ్లం సతీష్, బోజట్ల సత్యనారాయణ★ మరియు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఏబీపీపీ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా టి.వి. పుల్లంరాజు ఏకగ్రీవ ఎన్నిక





**ఖమ్మం, శబరిమల, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :**
అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ (ఏబీపీపీ) ట్రస్ట్ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం శబరిమల నారాయణతోడులోని అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచార సభ అన్నదాన మందిరంలో నిర్వహించారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ట్రస్ట్ ద్వైవార్షిక ఎన్నికలను ఏబీపీపీ మేనేజింగ్ ట్రస్టీ పి.ఎన్.కె. మేనన్ ఎన్నికల అధికారిగా, ఏబీపీపీ ప్రధాన కార్యదర్శి బెల్లపు హరిప్రసాద్ పరిశీలకుల పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ ఎన్నికల్లో తెలంగాణకు చెందిన డాక్టర్ తోకచిచ్చు వెంకట పుల్లంరాజు (టి.వి. పుల్లంరాజు) ఏబీపీపీ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేరళకు చెందిన కె. అయ్యప్పదాస్ అధ్యక్షులుగా, తెలంగాణకు చెందిన టి.వి. పుల్లంరాజు ప్రధాన కార్యదర్శిగా, తమిళనాడుకు చెందిన ఆర్. వెంకటేశన్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**ట్రస్ట్ సభ్యులుగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు**

ట్రస్ట్ సభ్యులుగా తెలంగాణ నుంచి రాచర్ల రమేష్ (హైదరాబాద్), బయ్యాన సంతోష్ (హనుమకొండ), ఆంధ్రప్రదేశ్ నుంచి లంకబాబు (విజయవాడ), ప్రవీణ్ నంబూద్రి (విశాఖపట్నం), తమిళనాడు నుంచి ఎల్.ఆర్. రాజు (కరూర్), వినాయగం (రాణిపేట), టి. వెంకటేశన్ (తిరువణ్ణామలై), కర్ణాటక నుంచి వంశీకృష్ణ ఎన్నికయ్యారు.

**భక్తులకు మరింత మెరుగైన అన్నప్రసాద సేవలు**

ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన టి.వి. పుల్లంరాజు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏబీపీపీ ట్రస్ట్ సేవలను మరింత విస్తరించేందుకు, ట్రస్ట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా మండల–మకరవిళక్కు సీజన్‌లో శబరిమలకు వచ్చే అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదాన మండపం ద్వారా నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాన్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.మండల–మకరవిళక్కు సీజన్‌లో సుమారు ఎనిమిది లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించే విధంగా ప్రణాళికలు రూపొందించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పుల్లంరాజు తెలిపారు.

**తెలుగు రాష్ట్రాలకు గౌరవం**

అయ్యప్ప స్వామి భక్తుల సేవా ట్రస్ట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తికి ప్రధాన కార్యదర్శి పదవి దక్కడం ఇదే ప్రథమమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పుల్లంరాజు ఏకగ్రీవ ఎన్నిక పట్ల తెలంగాణతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు, ఏబీపీపీ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.ప్రధాన కార్యదర్శిగా పుల్లంరాజు ఎన్నిక కావడం ద్వారా శబరిమలలో అయ్యప్ప స్వామి భక్తులకు అందించే సేవల్లో తెలుగు రాష్ట్రాల భాగస్వామ్యం మరింత పెరగనుందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా టి.వి. పుల్లంరాజును పలువురు అయ్యప్ప స్వామి భక్తులు, ఏబీపీపీ ప్రతినిధులు, ప్రముఖులు అభినందించారు.

# క్యాన్సర్ మహమ్మారీని పరద్రోలెందుకే హెచ్ పి వి వ్యాక్సిన్

- యు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ దేవిశ్రీ
- న్యూఈరా ఉన్నత పాఠశాలలో బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్





**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :**
క్యాన్సర్ మహమ్మారిని పూర్తిగా పరద్రోలెందుకే ప్రభుత్వం హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు యూ పి హెచ్ సి వైద్యాధికారి ఐ దేవిశ్రీ పేర్కొన్నారు. సమూలంగా నిర్మూలించేందుకే హెచ్పీవీ వ్యాక్సిన్ బాలికలకు ఉచితంగా ఇస్తున్నట్టు చెప్పారు. సోమవారం న్యూఈరా ఉన్నత పాఠశాలలో 14ఏళ్ళు నిండిన 22మంది బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ వేసినట్టు తెలిపారు. బాలికల్లో భవిష్యత్తులో గర్భశాయ క్యాన్సర్ రాకుండా నిరోధించిందానికే ఈ వ్యాక్సిన్ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ లక్ష్యంతో జిల్లా కలెక్టర్ దివాకర ఆదేశాలమేరకు జిల్లా వైద్యాధికారి డి రామారావు పర్యవేక్షణలో ఈ కారక్రమం అమలు జరుగుతుందన్నారు. అధికారికంగా ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్నప్పటికీ దీనిపై కొంత మంది అపోహలు, అనుమానాలు వ్యక్తంచేస్తున్నారని పేర్కొంటూ దానిని తీవ్రంగా ఖండించారు. దీనివల్ల ఎలాంటి చెడుప్రభావాలు ఉండవని, అర్హులైన ప్రతీ బాలికలకు వ్యాక్సిన్ వేస్తున్నామని ఇందుకోసం తాము అన్ని పాఠశాలల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనికిపాఠశాలల యాజమాన్యాలు, తల్లి, దండ్రులు బాధ్యత తీసుకోవాలని ప్రతీఒక్కరూ సహకరించి కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషిచేయాలని కోరారు. వ్యాక్సినేషన్ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం డాక్టర్ దేవిశ్రీ, హెచ్ ఈ ఓ రమణ, విద్యార్థులకు, పాఠశాల సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, రాబిస్, పాముకాటు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశాలపై పిల్లల కుటుంబసభ్యులకు ఈ వ్యాక్సిన్ కార్యక్రమంపైన అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ దేవిశ్రీ తోపాటు సూపర్ వైజర్లు, సి ఐ హెచ్ రమణ, జడ్ ఎస్ జయపాల్, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఏ ఎన్ ఎంలు వి శారద, బి సంధ్య, ఎస్ కె రహీంబి, ఆశకార్యకర్తలు రమాదేవి, వెంకటలక్షి తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు 'శీనన్న' భరోసా

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- పేదల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న మంత్రి: తుంబురు దయాకర్ రెడ్డి



**ఖమ్మం, తిరుమలాయ పాలెం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :**
ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబురు దయాకర్ రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 114 మంది లబ్ధిదారులకు మంజూరైన సుమారు 35 లక్షల 56 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తుంబురు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామ కృష్ణ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుంబురు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ "పేద ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలన్నదే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యం. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందేలా క్యాంప్ కార్యాలయం నిరంతరం పనిచేస్తుంది" అని తుంబురు దయాకర్ రెడ్డి అన్నారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం అనేక కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల అశోక్, మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్, కాంగ్రెస్ జిల్లా కమిటీ కార్యదర్శి ఉన్నం రాజశేఖర్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి, డైరెక్టర్ జడల నగేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిమెట్ల వెంకట్ కాంగ్రెస్ నాయకులు బత్తుల రవికుమార్, గుగ్గిళ్ల అంబేద్కర్, కర్నాటి రాజేంద్రప్రసాద్, కట్టుకూరి శ్రీనివాస్ రెడ్డి, జడల రమేష్, పోట్ల కిరణ్ కుమార్, తేజవత్ ఉపేందర్, జల్లేపల్లి గ్రామ సర్పంచ్ అన్నపర్తి రవి, కాంగ్రెస్ కార్యకర్తలుచిప్పరపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేత డాక్టర్ తుమ్మల యుగంధర్




**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** వినాయక చవితి సందర్భంగా సోమవారం స్థానిక ముస్తఫా నగర్ సంభాని నగర్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని సందర్శించి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్. ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్ కి పూలతో అపూర్వ స్వాగతం పలికిన మహిళలు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుపాకుల యలగొండ స్వామి, స్థానిక నాయకులు,అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# 26న చాకలి ఐలమ్మ జయంతిని, 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జయప్రదం చేయండి

**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఈనెల 26వ తేదీన చాకలి ఐలమ్మ జయంతిని, 27వ తేదీన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు బిసి శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలైన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్నాటి యాదయ్య, చింతకింది కుమార స్వామి, కోశాధికారి వనం సత్యనారాయణ, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధీటి నరసయ్య, నాయకులు ప్రభాకర్ రమేష్ లతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ దేశం కోసం ప్రజల కోసం ప్రజా చైతన్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధుల జయంతి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించి వారు చేసిన త్యాగాలను పోరాటాలను వాటి ఫలితాలను నేటి తరానికి తెలియజెప్పాల్సిన బాధ్యత మన అందరి పైన ఉన్నదని ఇవాళ కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద పార్టీలు దేశాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం కంకణం కట్టుకున్నారని దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోస్తున్నారని దేశంలో నిరుద్యోగం నిత్య జీవితాల వస్తువుల ధరలు పెరిగిపోతున్నా పట్టించుకోకుండా, ఒక పక్క ప్రభుత్వ రంగ



సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కి వేస్తూ మరోపక్క మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్న పాలకుల నిజస్వరూపాన్ని నాటి పోరాట యోధుల స్ఫూర్తితో తిప్పి కొట్టడానికి యువతను సమీకరించుకోవాలని అందుకు మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాలు వేదిక కావాలని వారు కోరారు

# పెసర పంటను కొనుగోలుకై గ్రీవెన్స్ లో సిపిఐ' రైతు సంఘం ఆందోళన

- **కొనుగోలు కు అధికారులు హామీ**

**ఖమ్మం, కొణిజర్ల, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** పెసర పంటను ప్రభుత్వ మార్కెఫేడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సోమవారం కొణిజర్ల ప్రజావాణి కార్యక్రమంలో సిపిఐ రైతు సంఘం ఆందోళన నిర్వహించారు. రైతుల ఆందోళనకు స్పందించిన మార్కెఫేడ్ జిల్లా మండల అధికారులు పెసర పంట కొనుగోలుకు హామీ ఇచ్చి రైతుల ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా జరిగిన రైతుల ఆందోళన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే రైతులు ఆందోళన చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు వ్యవసాయ పంట కొనుగోలు ప్రణాళికలు సిద్ధం చేయకపోవడం వల్ల కొనుగోలు జాప్యంతో రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు దళారీలకు అమ్ముకుంటున్నారని వారు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో పంట కొనుగోలు ప్రారంభించి ఉంటే రైతు మద్దతు ధరకు పంటలను అమ్ముకొని ఆర్థికంగా నష్టపోకుండా ఉండే పరిస్థితి ఉంటదని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు పథకాలు పెట్టినా పంట కొనుగోలులో నిర్లక్ష్యం చేయటమే రైతుకు తీవ్ర నష్టమని వారు పేర్కొన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల



జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్రబాబు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్, మండల కార్యదర్శి గడల భాస్కర్, జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, తుమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మునిగ కోటేశ్వరరావు, తోటపల్లి సీతారాములు, బిఆర్ఎస్ నాయకులు పొట్ల శ్రీనివాసరావు, రామ్ పూడి సురేష్, గోపాలరావు, కొమ్మినేని నరసరావు, గుడుగొర్ల శీను, ఎర్ర శ్రీను, కొమ్మినేని శీను, అడప వెంకటేశ్వర్లు, ఎస్.కె రజాక్, కూచిపూడి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్సై గా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ

**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన (11) పోలీస్ అధికారులు ఎస్ డి జలీల్, జె.రవి, ఎస్ కే ఖాసిం అలీ, కె.వెంకటేశ్వర రావు, కె.చెన్నారావు, ఎస్.శ్రీనివాసరావు, బి.పిచ్చయ్య, జి.హరి, ఎస్.వెంకట కోటిరెడ్డి, ఆర్.కాళహస్తి, బి.పెద రాజేందర్ లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా కు బదిలీపై వెళ్ళనున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ



రామానుజం, అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాద్ పాల్గొన్నారు.

# వల్లభనేని గురవయ్య మరణం పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం



**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త వల్లభనేని రామారావు తండ్రి గురవయ్య మరణం పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం తెలిపారు. గురవయ్య మరణం బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ అపార దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు వారి కుటుంబానికి ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# బడి వేళల్లో 'చిట్టి' గిరి

- **విద్యాబోధన గాలికి?**
- **ప్రభుత్వ పాఠశాలలో కొందరు ఉపాధ్యాయుల తీరుపై ఆరోపణలు**

**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన కొందరు ఉపాధ్యాయుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీత సమయానికి పాఠశాలకు హాజరు కావాల్సిన వారు ఆలస్యంగా వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు పాఠశాల సమయాల్లో విద్యార్థులపై దృష్టి సారించాల్సిన కొందరు ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లలో నిమగ్నమవుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.మరి కొందరు తమ వ్యక్తిగత చిట్టీల వ్యాపారానికి సంబంధించిన ఫోన్ సంభాషణలు, ఇతర పనుల్లో బడి వేళల్లోనే నిమగ్నమవుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఉపాధ్యాయుల వ్యక్తిగత వ్యవహారాలు విద్యాబోధనకు ఆటంకంగా మారితే దాని ప్రభావం నేరుగా విద్యార్థుల చదువుపైనే పడే అవకాశం ఉంది. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, సమయపాలన, బోధనా విధానాలపై పర్యవేక్షణకు పలు చర్యలు చేపడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత అధికారులు పాఠశాలలను తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.ఈ వ్యవహారంపై మరింత సమాచారం, క్షేత్రస్థాయి వివరాలను త్వరలో మీ ముందుకు తీసుకురానున్నాం.

# రెండవ దఫా భూ సేకరణ లో ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలి

- **అడవి మద్దులపల్లి రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన, వినతి**






**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** సీతారామ ప్రాజెక్టు భూ సేకరణ లో భాగంగా కామేపల్లి మండలం అడవి మద్దులపల్లి లో మరోసారి భూ సేకరణ కు ప్రభుత్వం సర్వే చేపట్టడం తో రైతులు తమ సాగు భూములు కు ఆరు సంవత్సరాల క్రితం ప్రకటించిన పరిహారం అవార్డు తో సంబంధం లేకుండా ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు ఇరవై ఐదు లక్షల రూపాయల పరిహారం అందించాలి అని జిల్లా కలెక్టర్ దివాకర్ కు విజ్ఞప్తి చేశారు. సోమవారం భూ నిర్వాసిత రైతులు కలెక్టరేట్ ఎదుట తమ భూములకు సరైన పరిహారం అందించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ దివాకర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ నిర్వాసిత రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలి అని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ అడవి మద్దులపల్లి లో ప్రస్తుత భూ సేకరణ కు నూతన అవార్డు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టేకుల తండా సర్పంచ్ రెడ్డి , మద్దులపల్లి మాజీ సర్పంచ్ జార గోపయ్య,కల్తీ ప్రవీణ్,మారం వెంకటప్ప రెడ్డి, కోనేటి కృష్ణ, సత్తి పాపయ్య, వెంకటేష్, వీరాస్వామి, చిన్న , వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు : మంత్రి తుమ్మల

**సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం**

**25 రోజుల్లో టన్నెల్ పనులు పూర్తి చేయాలి : అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

**ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, పంటలను కాపాడేందుకు గోదావరి జలాల వినియోగం**

**కమలాపురం పంప్‌హౌస్ నుంచి అన్నదైవం ప్రాజెక్టుకు నీటి విడుదల**

**కుమ్మరిపాడులో హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డు ప్రారంభం**





**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు.యాతాల కుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. టన్నెల్ పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.టన్నెల్‌కు సంబంధించిన మిగిలిన పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్ నెలలో టర్నల్ పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులతో 4 కోట్ల 63 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతో పాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.తదుపరి ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడో పంప్‌హౌస్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించి,మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. పంప్‌హౌస్ నుంచి విడుదలైన నీటి ప్రవాహాన్ని పరిశీలించి, నీటి విడుదలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి నీటిని అందించే దిశగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. యాతాలకుంట వద్ద టన్నెల్ పనులను పరిశీలించి, మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. టన్నెల్‌లో కొన్ని ప్రాంతాల్లో కింది భాగంలో ఖాళీలు ఉండటంతో వాటిని కాంక్రీట్‌తో పూర్తి స్థాయిలో ప్యాకింగ్ చేసి పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించామని చెప్పారు. టన్నెల్ పనుల్లో తొందరపాటు కంటే నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.అక్టోబర్‌లో సీతారామ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర పనులను వేగవంతం చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించామని తెలిపారు.సత్తుపల్లి ట్రంక్‌కు నీటిని తీసుకెళ్లే క్రమంలో భూసేకరణకు సంబంధించిన సమస్యలను దాదాపుగా పరిష్కరించామని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే అవసరమైన నిధులను కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ, నిర్మాణ పనులు, సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే వాటిని వేగంగా పరిష్కరించి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉండటం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని మంత్రి అన్నారు. వర్షాలు సకాలంలో లేకపోవడం వల్ల భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని, ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.వర్షాభావ పరిస్థితులు వ్యవసాయంతో పాటు విద్యుత్ రంగంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నీటి నిల్వలు తగ్గితే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంటుందని, అదే సమయంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాల కోసం విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పుడు థర్మల్ విద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. అందువల్ల నీటి లభ్యత, విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నందున సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 80 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉన్న ప్రాంతాలకు నీటి లభ్యతను పెంచే విధంగా సీతారామ జలాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.నాలుగో పంప్‌హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేయాలని మంత్రి తెలిపారు. ప్రధాన కాలువలతో పాటు అవసరమైన చోట్ల పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గుతాయని, నీటిని నేరుగా రైతుల పొలాలకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. పైప్‌లైన్‌తో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని, తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.సీతారామ ప్రాజెక్టు పనులపై జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్ష నిర్వహించాలని మంత్రి సూచించారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఎక్కడా పనులు నిలిచిపోకూడదని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా స్థాయిలో పరిష్కరించాలని అన్నారు. అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, మండల కార్యాలయాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కమలాపురం వద్ద పంప్ మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి ప్రయోజనం కల్పించే దిశగా మరో అడుగు ముందుకు వేసినట్లు మంత్రి తెలిపారు. విడుదలైన నీరు ఆయకట్టులోని రైతులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి విమానాశ్రయం, రైల్వే అనుసంధానం వంటి మౌలిక వసతులు అవసరమని మంత్రి తెలిపారు. విమానాశ్రయానికి సంబంధించి సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధమైన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. రైల్వే అనుసంధానానికి సంబంధించి పాండురంగాపురం–మణుగూరు మార్గం, భద్రాచలం వైపు రైల్వే విస్తరణ అంశాలపై కూడా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలోని వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, వర్షాలపై మాత్రమే ఆధారపడే పరిస్థితి తగ్గి సాగుకు నీటి భరోసా పెరుగుతుందని మంత్రి అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణమే మనందరి బాధ్యత

- ఖమ్మం ఎస్బిఐ జడ్పీ బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటిన ఆర్ఎం, జెడ్పీ బ్రాంచ్ మేనేజర్
- ఎస్బిఐ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎం రామమూర్తి, మేనేజర్ షేక్ ఇబ్రహీం



**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** స్వచ్ఛతా హి సేవ 2026 , మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎం రామమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని జెడ్పి ఎస్బిఐ బ్యాంక్ బ్రాంచ్ ఆవరణలో బ్యాంక్ మేనేజర్ షేక్ ఇబ్రహీం నేతృత్వంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలను నాటి మాట్లాడారు. వచ్చేనెల రెండవ తేదీన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా, స్వచ్ఛ భారత్ దివస్ లో భాగంగా మన పరిసర ప్రాంతాల్ని పరిశుభ్రంగా ఉంచుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు మనందరం పాటుపడాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి నీ పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తారని, స్వచ్ఛత హి సేవ 2026 కార్యక్రమంలో భాగంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. ప్రస్తుతం మొక్కలు నాటే కార్యక్రమంలో అనేకమంది యువత, ప్రజలు ఉత్సాహం చూపాలని తమ జన్మదినోత్సవాలు ఇతర వేడుకలలో సందర్భంగా ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించినప్పుడే ఆరోగ్య సమాజాన్ని నిర్మించిన వారమవుతామని ఆయన ఉద్ఘాటించారు. అనంతరం బ్యాంకు మేనేజర్ షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ ప్రతి ఎస్బిఐ బ్యాంక్ ఉద్యోగి తమ వేడుకలు సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు బ్యాంక్ ఆవరణలలో తమ గృహ సముదాయాల వద్ద మొక్కలు నాటి ఆకు పచ్చని ప్రపంచంగా తీర్చిదిద్దుతూ పర్యావరణాన్ని కాపాడుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు రాంభరన్, శ్రీలక్ష్మి , బ్యాంకు సిబ్బంది ఎస్బిఐ బ్యాంకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** వరకట్న వేధింపుల కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ ఖమ్మం 2వ అదనపు జేఎఫ్ సి ఎం కోర్టు న్యాయమూర్తి వై. బిందుప్రియ తీర్పు చెప్పారు.ముదిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నెంబర్ .239/2020, సిసి నెంబర్ 2533/2020, ఐపిసి సెక్షన్ 498–ఏ, వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేసిన ఈ కేసులో మదినేని బోసుబాబు, (40 సం) పాత కాచారం గ్రామం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా నివాసి, నిందితుడు–1గా ఉన్నారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కోర్టు 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష మరియు రూ.5,000 జరిమానా విధించింది.ఈ కేసులో దర్యాప్తు అధికారిగా అప్పటి ఎస్సై ఎం.డి. మౌలానా, బ్రీఫింగ్ అధికారి ప్రస్తుత ముదిగొండ పోలీస్ స్టేషన్ సిఐ మురళి వ్యవహరించారు.కేసు దర్యాప్తు, కోర్టు విచారణ ప్రక్రియలో ఏపిపి గాయత్రి,సిడిఓ సిహెచ్. శ్రవణ్, ప్రాసెస్ సిబ్బంది లైజన్ అధికారులు కె. శ్రీకాంత్, ఎస్ఐ,హెచ్ సి డి. నాగేశ్వరరావు,హోంగార్డ్ ఎం. కాంతారావు లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## అన్నదానాని ప్రారంభించిన వడ్డెబోయిన నరసింహారావు




**ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల 25 వ డివిజన్ లోని అదంకి వారి వీధి లో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ 20వ వార్షికోత్సవం సందర్భంగా కమిటీ వారి ఆధ్వర్యంలో గణేష్ మండపం ముందు మహా అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన ఇందిరా నరసింహ రావు దంపతులు, బేబీమూన్ హైస్కూల్ అధినేత కేసా వీరన్న విచ్చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ వారిని అభినందించి ముఖ్య అతిథిగా పిలవడం సంతోషం గా ఉంది అని మహా అన్నదాన వితరణ దాతలు నోముల శ్రీను శైలజ దంపతుల కుటుంబ సభ్యులను అభినందించి కేవలం ఆధ్యాత్మికత పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యత సోదర భావం మత సామరస్యాన్ని పెంపొందించాలని అన్నారు. శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కంబాల అచ్యుత ప్రసాద్ సిబ్బడి బాబూరావు శ్రీలత రామగోని వెంకట రమణ దంపతులు రామగోని నిర్మల లావణ్య అరుణ సౌమ్య డివిజన్ ప్రముఖులు దాసరి పూర్ణ అనిశెట్టి గిరి బండారు శ్రీనివాస్ గుజ్జరు శ్రీనివాస్ నాగిశెట్టి రాధకృష్ణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620